మాస్టర్ పార్వతీకుమార్

# ధర్మ విగ్రహుడు - శ్రీరాముడు



ధనిష్ఠ

# ధర్మ విగ్రహుడు - శ్రీరాముడు

మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ

**ధర్మ విగ్రహుడు - శ్రీరాముడు**

ప్రథమ ముద్రణ : 22-7-2011

ప్రతులు : 1,000

వెల : ₹ **21 - 00**

*ప్రాప్తిస్థానము :*

**జగద్గురు మందిరము**
(ది వరల్డ్ టీచర్ టెంపుల్)
'రాధామాధవమ్'
14-38-2, ముప్పిడి కోలనీ,
విశాఖపట్నం - 530 002.
ఫోన్ : 0891-2701531
e-mail : dhanishta@rediffmail.com

*ముద్రణ :*
ఎక్సేలియన్ ప్రింటింగ్ స్కూల్
విశాఖపట్నం - 530 016.
☏ 0891-2747320, 98 48 07 51 32.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువ లేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ"** మాస్టర్ పార్వతీకుమార్‌గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపము లోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును సద్గోష్ఠికై వలసిన వాతావరణమును – "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## సంకలనకర్త : మాస్టర్ పార్వతీకుమార్

**మా**తృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయి లకు వెలుగుదారి చూపించు చున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ పార్వతీకుమార్**గారు. వారి బోధనలు లెక్కకుమించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియవచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణ యోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించు చున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళారంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టానందించి, ఆదర్శవంతమైన వారి సేవలను కొనియాడినది.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో – మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే దానికి సాఫల్యత, సార్థకత ఉండునని, *"మానవ సేవయే మాధవ సేవ"* అను మాటకు

సరియైన అర్థము యిదేనని మాస్టరుగారు తమ ప్రవర్తన ద్వారా తెలియ పరచుచున్నారు. మాస్టర్ పార్వతీకుమార్‌గారు బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక – మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, శతాధిక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొనుచుండు ననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు మాస్టరుగారి దృఢ విశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

మాస్టర్ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశ విదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము పరమధర్మ" మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించుచున్నది. భగవద్ధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠా ఫౌండేషన్**

# ముందుమాట

శ్రీరాముని ప్రస్తావన ఎన్నిమార్లు జరిగిననూ రమ్యముగనే ఉండును. రామనామము హృదయ రంజకము. సర్వపాపహరము. రాముని మించిన ఆదర్శమూర్తి మానవులలో మరియొకరు లేరు. అతడు నరునిగను, పరునిగను నడచిన తీరు అనుపమానము. *"రామో విగ్రహవాన్ ధర్మః"* అనునది శాశ్వతసత్యము. ధర్మమునకు ప్రతిరూపమే శ్రీరాముడు. అట్టి శ్రీరాముని వేనోళ్ళ కొనియాడినను తనివి తీరదు.

శ్రీ విష్ణు సహస్రనామ వివరణమును 1992 నుండి 1998 వరకు ఆరు సంవత్సరములపాటు దీక్షగా కొనసాగించిన **మాస్టర్ పార్వతీకుమార్** గారికి శ్రీరాముడే పరమ దైవము. '**శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రము**'న వారు **"రామో విరామో విరజో"** అను **నలుబది మూడవ** (**43**) శ్లోకమునకు యిచ్చిన వివరణము, వారి సహస్రనామ ప్రవచనమున ఒక మచ్చు తునక.

వారి **శ్రీమతి కృష్ణకుమారి గారి షష్ట్యబ్ది పూర్తి ఉత్సవము** భద్రాద్రి యందు నిర్వర్తింపబడుట శ్రీ సీతారాముల సంకల్పమే. ఆ సందర్భమున పూజ్యభావము గల జగద్గురు పీఠము సోదరబృందము ఈ శ్లోక వివరణమును ప్రచురించదలచినది. వారియందు అట్టి ప్రేరణ కలిగించినవాడు కూడ రాముడే. శ్రీరాముని గూర్చిన ఈ వివరణము స్ఫూర్తివంతము. మాస్టర్ పార్వతీకుమార్‌గారు **శ్రీ విష్ణు సహస్ర నామ ప్రవచనము**లతో పాటు **శ్రీమద్రామాయణ ప్రవచనములు** గూడ **ఆరు సంవత్సరము**లపాటు ప్రతి శనివారము గావించిరి (1992 - 1998). ఆ వివరణము శ్రోతలకు స్ఫూర్తి దాయకమై నిలచినది.

మాస్టరుగారి సతీమణి శ్రీమతి కృష్ణకుమారి గారు 39 సం॥లుగ వారి ధర్మకార్యము లందు అక్షరములా సహధర్మచారిణియై నిలచినారు. వారితో ప్రపంచయాత్రలు గావించినవారు. భూగోళ ప్రదక్షిణము గూడ రెండు మారులు చేసినారు. అనేక పుణ్యక్షేత్రములను భౌగోళికముగ దర్శించినారు. వారి జీవితమున శక్తిస్వరూపిణియై సర్వ శుభకార్యముల యందు వారు భాగమై నిలచినారు. **ఆషాఢ కృష్ణ చతుర్థి ఆదివారం శతభిషా నక్షత్రము నందు జన్మించిన శ్రీమతి కృష్ణకుమారి** గారు వేలాదిమంది అనుయాయులచే **మాతృమూర్తి**గా గౌరవింపబడు చున్నారు. పూజింపబడు చున్నారు కూడ. **"అన్నము పెట్టుటలో ఆమె కామెయే సాటి."** ఆమె శక్తి స్వరూపము అనునది అనుయాయి లందరికీ విదితమే.

శ్రీ సీతారాముల ఆశీర్వచనముగ ఆమె షష్ట్యబ్దిపూర్తి పండగను భద్రాద్రిలో సోదరబృందము భక్తిపూర్వకముగ నిర్వర్తించుకొను చున్నది. **అట్టి శుభ సందర్భమున శ్రీరాముని పాదములకు ఈ చిఱు పుస్తకము సమర్పింప బడుచున్నది.**

ఈ పుస్తకమును శ్రద్ధా భక్తులతో అసామాన్యమగు స్ఫూర్తితో ముద్రించిన సోదరులు శ్రీ పసుమర్తి కృష్ణమోహన్, ధనంజయలకు కృతజ్ఞతాభి వందనములను తెలియజేయు చున్నాము. అదే విధముగ ఈ నామములను వివరించి, ముద్రణకు తోడ్పాటు గావించిన సోదరీమణులు సౌభాగ్యవతులు కామరాజుగడ్డి రమణి, జోస్యుల స్వర్ణలతలకు ఆశీర్వచనములు అందించ బడుచున్నవి.

తొలిఏకాదశి — **కంభంపాటి శివశంకర్**

11-7-2011



ఆపదామపహర్తారం దాతారం సర్వసంపదామ్ ।
లోకాభిరామం శ్రీరామం భూయో భూయో నమామ్యహమ్ ॥



# ధర్మ విగ్రహుడు - శ్రీరాముడు

రామో విరామో విరజో మార్గో నేయో నయో నయః।
వీరః శక్తిమతాం శ్రేష్ఠో ధర్మో ధర్మ విదుత్తమః ॥

రామనామం భగవంతుని నామాలలో అత్యంత ప్రాధాన్యత వహించినది. విష్ణు సహస్ర నామాలలోని వెయ్యిన్నీ ఎనిమిది నామాలలో అత్యంత శక్తివంతమైనది. అత్యంత ప్రియకరమైనది. అత్యంత రక్షణ నిచ్చేది రామనామం. భారతీయ సంప్రదాయంలో రామనామానికి ఉన్నంత ప్రచారం కాని, రుచి గాని మిగతా నామాలలో ఎక్కడా కనబడదు. సాక్షాత్తు పార్వతీదేవి 'ఇన్ని నామాలలో ఏ నామం ఉత్తమమైనదని' అడిగితే,

"శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే ।
సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే ॥"

అని పరమేశ్వరుడే చెప్పిన నామం యిది. ఈశ్వర నామ సంవత్సరంలో ఈశ్వరుడే చెప్పిన రామనామం. ఆయన ఈ నామాన్ని హృదయంలో ఎల్లప్పుడూ ఉచ్చరిస్తూ వుంటానని చెప్పిన సందర్భం ఉన్నది. విష్ణు హృదయంలో పరమేశ్వరుని ధ్యానం జరుగుతుంటే, పరమేశ్వరుని హృదయంలో విష్ణు ధ్యానం జరుగుతూ వుంటుంది. రాముని

హృదయము నందుండేది ఈశ్వరుడు. అందుకని వంతెన కట్టే ముందు రామేశ్వరంలో ఈశ్వర స్థాపనం చేసి, ధ్యానం చేసుకొని, ప్రసన్నుని చేసుకొని ఆ తరువాత వంతెన నిర్మాణానికి పూను కుంటాడు శ్రీరాముడు. అందుకనే పెద్దవాళ్ళు పిచ్చిపిచ్చి మాటలతో కాలము వృథా చేసుకోవడం కన్న 'రామకోటి' వ్రాసుకుంటే అందులో నుండి చాలా పవిత్రీకరణ జరుగుతుం దన్నారు. అలా వ్రాస్తూ ఉంటే మనసు నియమింపబడి, నిర్వహింపబడి పరము చేరే మార్గము లభిస్తుంది. ఇప్పటికీ హిమాలయాలలోని గంధమాదన పర్వతంలో హనుమంతుడు రామనామం జపిస్తూ ఉన్నాడని, పిలిస్తే పలుకుతాడని చెప్తారు. "నా నామం అవసరం లేదు. రామనామం తలచుకుంటే మీకు చేయవలసిన వన్నీ చేసి పెడతాను'' అని వాగ్దానం చేసినవాడు హనుమంతుడు.

**"యత్ర యత్ర రఘునాథ కీర్తనం, తత్ర తత్ర కృతమస్తకాంజలిం।**
**బాష్పవారి పరిపూర్ణలోచనం, మారుతిం నమత రాక్షసాంతకమ్ ॥"**

అన్నారు కదా! కాబట్టి ఒళ్ళు పులకించి దానివల్ల ఏర్పడ్డ అశ్రువులతో తల వంచుకొని దండం పెట్టుకుంటూ వుంటాడట. అలా పరిపూర్ణ యోగులు, సిద్ధులూ కూడా సతతము స్మరణ చేసే నామం కాబట్టి, ఈ రామ నామాన్ని మనం కూడా జీవితంలో ఒక భాగం చేసుకోవాలి. *"శ్రీరామ రక్ష సర్వ జగద్రక్ష!''* అన్న నానుడి ఉంది. శ్రీరాముడు రక్షణకు ప్రసిద్ధి కాంచిన దైవతత్త్వము. ఆపదల నుండి రక్షించాలంటే రాముడే.

"నమః కోదండ హస్తాయ, సంధీకృత శరాయచ ।
ఖండితాఖిల దైత్యాయ, రామా ఆపన్నివారణే ॥"

అని పెద్దలు శ్లోకం చెప్పారు. 'రామా' అని పిలిస్తే మరుక్షణం రక్షణ యివ్వడానికి సంసిద్ధుడై వుంటాడు. అదీ రామనామ రక్షణ లోని గొప్పదనం. జనస్థానంలో కనురెప్పపాటులో వింటికి నారి సంధించి, అస్త్రాన్ని ధరించి **14** వేలమంది రాక్షసులను ఒకే బాణంతో చంపిన ధీమంతుడు, పరాక్రమశాలి రాముడు. రాముని రక్షణ చాల గొప్పది. ఎదుటి వ్యక్తి మంచి వాడా, చెడ్డవాడా అనే వాటితో సంబంధం లేకుండా రక్షణ కోరితే రక్షించేవాడు రాముడు. ఇంకో దైవతత్త్వం అలా కనిపించదు.

అరణ్యంలో కాకాసురుడు వచ్చి సీతాదేవి రొమ్మునందు పొడిచి బాధ కలిగిస్తే, ఆ రక్తపుబొట్లు రాముని మీద పడగా, లేచి కాకి చేసిన పని చూసి, ఒక దర్భను మంత్రపూతం చేసి, బ్రహ్మాస్త్రంగా వదలుతాడు. రాముని యొక్క పరాక్రమాన్ని, కోపం వస్తే రాముడెట్లా వుంటాడో చూడాలన్న ఉద్దేశ్యంతో చేసిన ప్రయత్నం. అమ్మవారిని బాధపెడితే ఆయనకు వచ్చిన కోపం నుండి ఆయన వదలిన అస్త్రం! ఈ కాకి మూడులోకాలూ తిరిగితే, ఎవ్వరూ రక్షణ యివ్వలేకపోతే, చివరకు రాముని వద్దకే వచ్చి రక్షణ కోరుతుంది కాకి. అప్పుడు రాముడు "నేను సంధించిన బ్రహ్మాస్త్రానికి ఏదో ఒక ప్రయోజనం ఉండాలి కాబట్టి, నువ్వే చెప్పు. నీలో ఏ అంగం తీసేయమంటావో! ఒక్క అంగాన్ని తీసి, నిన్ను రక్షిస్తాను" అన్నాడు. కాకి "కన్నులు ప్రాణంతో సమానం కాబట్టి, నా రెండు కన్నులలో ఒక కన్నుని

బ్రహ్మాస్త్రమునకు బలిచేసి నన్ను రక్షించు'' అని కోరుకుంటే రక్షించిన వాడు రాముడు. తనను నమ్మినవారిని అలా రక్షిస్తాడు రాముడు. అలాగే సుగ్రీవ రక్షణ కూడా మహత్తరమైన ఘట్టం. వాలిని నిర్జించడం సామాన్య విషయం కాదు. సృష్టిలో ఎవరూ గెలవలేని వానిని నిర్జించడానికి, ధర్మం కోసం ఒక బలహీనుడికి శరణు యివ్వడం అనేది ఎంతో పరాక్రమవంతుడైతే తప్ప చేయ లేడు. విభీషణుడికి కూడా ఆ విధంగానే రక్షణ యిచ్చాడు. రామ నామం చేసుకొనేవారికి “మనం మంచివాళ్ళం కాదేమో! మనకి రక్షణ దొరక దేమో!'' అన్న బాధ అవసరము లేదు.

రాము డెపుడూ ధనుర్ధారియై వుంటాడు. ధనుస్సు రెండింటికి సంకేతం. ఒకటి రక్షణకు, మరొకటి ఓంకారానికి. అందుకనే రామునితోపాటు ఓంకార మున్నది. యోగ సాధనలో కూడా రామ తత్త్వం చాలా సులభంగా మనిషిని ఉద్ధరించి తన యొక్క స్వస్వరూపాన్ని, అనుభూతిని అందించగల మహత్తరమైనది. 'రామ' శబ్దంలో 'ర' అక్షరం అగ్నిబీజం. అంచేత రామనామం చేసేవారికి సహజంగా శరీరము, ఇంద్రియములు, మనస్సు పవిత్రీకరించబడి పిచ్చి పిచ్చి ప్రవర్తన, మాటలు, ఆలోచనలూ లేకుండా మలచ బడతారు. రామశబ్దం ఉచ్చరించినట్లైతే మనలోపల అగ్ని ప్రజ్వలింప బడి ఆ అగ్ని మలినాలన్నిటినీ కాల్చేస్తుంది. మనలోని ఎన్నో అనారోగ్యకరమైన సంస్కారములను ఈ రామనామం దగ్ధం చేసేస్తుంది. రామనామంతో త్వరితగతిని భగవంతుని చేరిన భక్తు లున్నారు. రాముని కన్న రామనామం గొప్పదని చెబుతారు. ఒక

ఆటవికుడు రామనామం చేత మార్పు చేయబడి ఒక ఋషి (వాల్మీకి) అయ్యాడు. అంతే కాదు; ఆయన మానవజాతికి మొట్టమొదటి ఋషి. మొట్టమొదటి మహాకావ్యాన్ని అందించినవాడు. మొట్టమొదటి వాఙ్మయాన్ని అందించినవాడు. అప్పటికింకా రాముడు అవతరించ లేదు. భగవంతుని నామాలలో 'రామనామం' ఒకటి అన్నప్పుడు, ముందు రామనామం- 'రామ' అనే శబ్దం, తరువాత రామావతారం. రామ శబ్దానికి ప్రతీకగా రామావతారం నడిచింది. కేవలం ధర్మాన్ని మాత్రమే ప్రవర్తింపచేసి, నిర్వర్తింపచేసి ఉదాహరణగా నిలచినవాడు రాముడు.

'రామ'నామం చెప్తూ శిలలు సముద్రంలో వేస్తే తేలినాయి. 'రామ' శబ్దం గుర్తుంచుకొని హనుమంతుడు నూరు యోజనముల సముద్రాన్ని లంఘించి లంక చేరుకోవడం జరిగింది. ప్రస్తుతం మనకున్న దేశ కాల మాన పరిస్థితులలో మనకు రక్షణకు రామ నామాన్ని మించినది లేదు. మనకు రక్షణ కావాలన్నా, మన దేశానికి రక్షణ కావాలన్నా, మొత్తం జాతికే రక్షణ కావాలన్నా రామనామం చాలు. ఇప్పుడు కూడా అదే చేసుకోవాలి. ఎందుకంటే అగ్నితత్వం కాబట్టి. సమస్త సృష్టి అగ్నికార్యం కాబట్టి, మిగతా సృష్టి శక్తులన్నీ కూడా దానికి లోబడే వుంటాయి తప్ప మరే విధంగానూ వుండటానికి వీలు లేదు. 'ర' శబ్దం ఆ విధంగా వుంటే, 'మ' శబ్దం అమృతత్వ సిద్ధిని అనుగ్రహించే శబ్దం. అమృతావతరణమే కదా మాస్టర్ సి.వి.వి.గారి యోగము యొక్క పరమావధి. ఈ శరీరం పడి పోవటమే తప్ప, 'నే'నుంటాను అని తెలిసేవరకూ ఆయన ఏ విధంగా

సాధన చేయాలో చెప్పి వున్నారు. అష్టాంగయోగంలో యివ్వబడ్డ సాధన అదే! అది రామ శబ్దంచేత కూడా సిద్ధిస్తుంది.

రామ శబ్దాన్ని సంఖ్యాపరంగా తీసుకుంటే, **25** వ అంకె వస్తుంది. 'ర' **2** వ అంకెకు, 'మ' **5** వ అంకెకు సంకేతంగా యివ్వబడ్డాయి. కనుక 'రామ' అంటే **25**. మొత్తం సృష్టి **24** తత్వములతో చేయబడి, **25** వ దైన కాలమనే దైవంచేత పరిపాలింప బడుతూ వుంటుంది. కపిలుడు దేవహూతి కిచ్చిన ఉపదేశాలలో యిది కనిపిస్తుంది. కాబట్టి 'రామ' శబ్దాన్ని మనం ఉచ్చారణ చేస్తున్నప్పుడు సృష్టిలోని **25** తత్వములు మనయందు ప్రసన్నత కలిగి ఉంటాయి. అవి ఈ క్రింద విధంగా ఉంటాయి.

| | | |
|---|---|---|
| *పంచ భూతములు* | : | **1.** భూమి. **2.** నీరు. **3.** అగ్ని. **4.** వాయువు. **5.** ఆకాశం. |
| *పంచ కర్మేంద్రియములు* | : | **1.** కాళ్ళు. **2.** చేతులు. **3.** వాక్కు. **4.** మల విసర్జనావయవము. **5.** మూత్ర విసర్జకావయవము. |
| *పంచ జ్ఞానేంద్రియములు* | : | **1.** చెవులు. **2.** కళ్ళు. **3.** ముక్కు. **4.** నాలుక. **5.** చర్మము. |
| *పంచ తన్మాత్రలు* | : | **1.** వినుట. **2.** చూచుట. **3.** రుచి చూచుట. **4.** వాసన చూచుట. **5.** స్పర్శ గ్రహించుట. |

*నాలుగు తత్వములు* : **1.** వాసుదేవ. **2.** సంకర్షణ.
**3.** ప్రద్యుమ్న. **4.** అనిరుద్ధ.

ఈ పంచ భూతములు, తన్మాత్రలు, ఇంద్రియము లన్నిటి మధ్య చక్కటి అనుసంధాన మున్నది.

| పంచభూతములు | గుణము | ఇంద్రియము |
|---|---|---|
| ఆకాశము | వినికిడి | చెవి |
| వాయువు | స్పర్శ | చర్మము |
| అగ్ని | చూపు | కన్ను |
| పృథివి | వాసన | ముక్కు |
| నీరు | రుచి | నాలుక |

మనకు నాలుగు పంచారములు (Four Five Pointed Stars) వున్నాయి. వీటినే 'నాలుగు మకరములు' అనవచ్చు. ఈ నాలుగు పంచారములలో ఒక్కొక్క పంచారానికి **5** చొప్పున **20** తత్వాలు వున్నాయి. ఈ నాలుగు పంచారాలను ఒక్కొక్క వ్యూహం అధిష్ఠించి వుంటుంది. వానినే *'వాసుదేవ వ్యూహము', 'సంకర్షణ వ్యూహము', 'అనిరుద్ధ వ్యూహము', 'ప్రద్యుమ్న వ్యూహము',* అంటాము. ఇవన్నీ మనలో కూడా వున్నాయి.

మొత్తం తత్వాన్ని **'వాసుదేవుడు'** అంటారు. అందరిలోనూ నివసించే దేవుడు. నేనొకణ్ణి వేరుగా వున్నాననుకోవడం అహంకార స్వరూపం. దీనినే 'దిగిరావడం' అంటారు. మొత్తం నదిలో బిందె

ముంచితే ఆ నీళ్ళు మన బిందెలో నీళ్ళయినట్లు. మొత్తం తత్వం ఒక తత్వంగా వేరుపడ్డదానిని 'సంకర్షణ' అంటారు. అప్పుడు అహంకార స్వరూపం ఏర్పడుతుంది. ఆ తరువాత వాసుదేవ, సంకర్షణ తత్వాల వెలుగే 'ప్రద్యుమ్నుడు'. ఆ తత్వం ఇంద్రియాల నుండి పనిచేయడం 'అనిరుద్ధుడు'. అదే మనకు శ్రీకృష్ణుడు '

"ఇమం వివస్వతే యోగం ప్రోక్తవాన్ అహమవ్యయమ్ ।
వివస్వాన్ మనవే ప్రాహ మనురిక్ష్వాక వేఽబ్రవీత్ ॥"

అంటాడు భగవద్గీతలో. అంటే "నేను సూర్యుడికి చెప్పాను. సూర్యుడు తన కొడుకైన మనువుకు చెప్పాడు. ఆయన భూమికి రాజైన ఇక్ష్వాకువుకి చెప్పాడు" అని. మన సూర్యుడి పేరు వివస్వతుడు. అందుకే అతని కొడుకును వైవస్వత మనువు అంటారు. ఇలా నాలుగు స్థితులు. ఇలా నలుగురు : నేను - సూర్యుడు - మనువు - ఇక్ష్వాకు.

అంటే మొత్తం తత్వంలో ఒక్కొక్క జీవుడు ఒక్కొక్క సూర్యుడైతే, మన బుద్ధి మనువైతే, మన మనస్సు ఇక్ష్వాకు అవుతాడు. ఎందుకని? మనస్సు శరీరానికి రాజు. శరీరం పృథ్వి అయితే, శరీరానికి రాజు మనస్సైతే, పృథ్వికి రాజు ఇక్ష్వాకు అవుతాడు. అందుకనే మనస్సు ఆధారంగా శరీరానికి అన్నీ అందజేస్తుంటాము. మనస్సు ఎక్కడి నుండి అందుకుంటుంది? బుద్ధి నుండి. బుద్ధి ఎక్కడి నుండి అందుకుంటుంది? 'నే' నున్నాననే అహంకార తత్వం నుండి అందుకుంటుంది. వాడెక్కడి నుండి అందు కుంటున్నాడు? ఈ మొత్తంలో నుంచే అందుకుంటున్నాడు. ఆ మొత్తమే 'నేను'

అంటాడు శ్రీకృష్ణుడు. మనలో మనసుగా, బుద్ధిగా, అహంకారంగా, దైవతత్వంగా నాలుగు వ్యూహాలుగా భగవంతుడు పనిచేస్తున్నాడు. ఒక వ్యూహంలో మనం కూడా భగవంతుడు అవుతాము. అందుకనే 'అతడే నేను' అని ధ్యానం చేసుకోమని చెబుతారు.

కాని దైవమే ఒక జీవిగా వ్యక్తమైనప్పుడు, అతడే మనంగా వున్నామని మరచిపోయినప్పుడు, మనకు అహంకారం వస్తుంది. అలా అహంకారం రాగానే దేవుడు జీవుడై పోయాడు. కాని మొత్తమే తానుగా వున్నానని గుర్తున్నంతసేపూ దైవీ స్వభావం కలిగి ఉండటం చేత, దైవంతో యోగం చెంది వుండడం చేత తన బుద్ధి ఎప్పుడూ వెలిగింపబడి వుంటుంది. అలా వెలిగింపబడిన బుద్ధిలో పనిచేసే మనసుకు ఇంద్రియములు, శరీరము లోబడి వుంటాయి. యోగం అదృశ్యమైతే, వెలుగు తగ్గి, వేరుగా వుంటాడు. మనసుకు బలం ఎక్కువై అహంకార తత్వాన్ని నెమ్మదిగా వశం చేసుకుంటుంది. మనసు, ఇంద్రియములు, శరీరము మూడూ శరీరానికి సంబంధించి నవి. ఇలా నాలుగు వ్యూహాలుగా దిగివచ్చిన వాటినే పరా ప్రకృతి, అహంకారం, బుద్ధి, చిత్తంగా చెప్తాడు భగవద్గీతలో. ఇలా దిగివచ్చిన తత్వం వీటిని ఆక్రమించి పరిపాలిస్తుంటే నలుగురు కలిసి నాలుగు పంచారములను ఎక్కి తిరుగుతూ వుంటారు. 'పంచారము' అంటే సంస్కృతంలో మకరము అని అర్థము. 'మ' అంటే 5 'కరములు' అంటే భుజములు. మకరము అంటే 5 భుజములు కలది అని అర్థం. Five Pointed Star అన్నదానికి వేదసంకేతం 'మకరం'.

అంతటా వ్యాపించివున్న దైవంయొక్క అస్తిత్వాన్ని మరచినప్పుడు మకరము లది పైచేయి అవుతుంది. అది గుర్తున్నప్పుడు జీవుడిది పైచేయి అవుతుంది. అదే *'గజేంద్ర మోక్షం'.*

గజేంద్రుడు నీటిమీద ఆశకొలదీ అందులో ప్రవేశించి కర్తవ్యం నిర్వహించడం కాకుండా చెరువులో నీటిని అల్లకల్లోలం చేశాడు. అంతకు మునుపు ఎన్నోసార్లు ఆ చెరువుకు వెళ్ళాడు, వచ్చాడు. కానీ ఆ రోజు భగవంతుడితో విడివడి *'దశ లక్షకోటి కరణీ నాథుండనై యుండి'* అంటే పదిలక్షల కోట్ల ఏనుగులకు అధిపతిని అనుకునేప్పటికి దర్పం పెరిగింది. మనం కూడా 'ఓం'కార స్వరూపులమే. మనచుట్టూ వుండేవాళ్ళు పొగిడేసరికి మత్తెక్కి, మదమెక్కి సంసారం అనే చెరువులో అతిక్రమించి ప్రవర్తిస్తే, సృష్టి అనే మకరం పట్టేస్తుంది. అదే విధంగా మొసలి గజేంద్రుని పట్టేసింది. ఈ మకరాన్ని స్వాధీనం చేసుకోవడమే యోగ మని చెబుతారు పెద్దలు. అది మన వశం కాదని గజేంద్ర మోక్షం చెబుతుంది. ఎందుకంటే గజేంద్రుడు స్వశక్తితో వెయ్యేళ్ళు పోరాడాడు.

"పృథుశక్తిన్ గజ మా జలగ్రహముతోఁ బెక్కేండ్లు పోరాడి సం
శిథిలంబై తనలావు వైరిబలముం జింతించి మిథ్యామనో
రథ మింకేటికి దీని గెల్వ సరి పోరం జాలరా దంచు స
వ్యథమై యిట్లనుఁ బూర్వపుణ్యఫలదివ్యజ్ఞానసంపత్తితోన్."

అంటాడు.

ఇదివరకు చేసుకున్న పుణ్యకార్యంచేత గుర్తొస్తాడట! ఎవరు? **'వాడు'**. సృష్టి కన్నా మనం బలవంతులము కాము. ప్రతివాడికీ ఎంతో సంసారముండీ కప్పల తక్కెడలాంటి మన సంసారము ఎప్పుడూ ప్రశాంతంగా వుండదు. ఇవన్నీ మనం సర్దుతూ వుంటే, గజేంద్రుడు మొసలితో పోరాడినట్లే వుంటుంది. మన శరీరం ఒక పంచారం. చెప్పిన మాట వినడం లేదు. ఎన్ని చేసినా ఇంకొకటి వుంటుంది. ఇంద్రియాలు మాట వినవు. అదో పంచారం. విన కూడనివి వింటూ, చూడకూడనివి చూస్తూ, తినకూడనివి తింటూ, వీటన్నిటికీ బానిసగా వుంటే, మకరానికి దొరికిపోయినట్లే. నీ అంతట నీవు పోరాడితే కాదు. నీకు, వాడికి పుట్టుక స్థానమైనవాణ్ణి పట్టుకో! ఎవడిని పట్టుకుంటే యివన్నీ స్వాధీనపడతాయో, వాడిని పట్టుకోవాలి. గజేంద్రుడికి ఆ ఉపాయం స్ఫురించి అటు తిరిగి ఆయనతో యోగం చెందాడు. అందుకే 'వాడు' సుదర్శన చక్రం వదిలాడు. సుదర్శన చక్రం కాలానికి ప్రతీక. కాలాన్ని అధిష్ఠించి ఉన్నవాణ్ణి ప్రార్థిస్తే, కాలం సహకరిస్తుంది. అందుకే గజేంద్రుడు సమస్తాన్ని అధిష్ఠించి వున్న తత్వాన్ని గూర్చి ప్రార్థన చేశాడు.

> "ఎవ్వనిచే జనించు జగ మెవ్వనిలోపల నుండు లీనమై
> యెవ్వనియందు డిందుఁ బరమేశ్వరు డెవ్వఁడు మూలకారణం
> బెవ్వఁ డనాదిమధ్యలయుఁ డెవ్వఁడు సర్వముఁ దానయైనవాఁ
> డెవ్వఁడు వాని నాత్మభవు నీశ్వరు నే శరణంబు వేఁడెదన్."

- అంటూ పరతత్వాన్ని ప్రార్థనచేస్తే, విష్ణువు పని చేసిపెట్టాడు. ఎందుకంటే సృష్టి, స్థితి, లయలలో స్థితి కారకుడు విష్ణువే.

" విశ్వమయత లేమి వినియు నూరక యుండి
రంబుజాసనాదు లడ్డపడక
విశ్వమయుఁడు విభుఁడు విష్ణుండు జిష్ణుండు
భక్తియుతున కడ్డపడఁ దలంచె."

గజేంద్రుడు అంతా వ్యాపించిన తత్వాన్ని నీలో చేర్చుకోమని కోరలేదు. 'ఈ మకరం బారినుండి నన్ను రక్షించు' అని కోరుతున్నాడు. కాలానికి ప్రతీక అయిన సుదర్శన చక్రం చేత ఆ మకరాన్ని ఖండించాడు. ఖండిస్తే మకరం చచ్చిందా? అది చావలేదు. అవి అసలు చావవు. అందుకే మన పెద్దలు *'యురేనస్'* అంటే *'వరుణుడు'* అనే దేవత నిచ్చారు. ఆయన ఆకాశంలో ఒక తెల్లని మొసలిమీద కూర్చుని తిరుగుతూ వుంటాడట. మొసలిని అధిష్ఠించి తిరగటమే! అది యోగులకు సాధ్యం. కారణం ఏమిటంటే, వీటి అన్నిటికీ పుట్టుక అయిన పరతత్త్వాన్ని వీడక, దానినుండి వేర్పాటు కాక జీవిస్తూ వుండటమే రహస్యం. ఈ మొత్తాన్ని నడిపించే శక్తి ఏదైతే వుంటుందో ప్రకృతి శక్తులన్నీ కూడా దానికి సహకరించడం జరుగుతుంది. అలాంటి శక్తి అయిన రాముణ్ణి తలచుకోవడం వలన మనలో సహజంగా ధర్మప్రవృత్తి వృద్ధి పొందుతూ వుంటుంది. ధర్మాన్ని అనుసరించకుండా మనం ఎలా పడితే అలా ప్రవర్తించి దైవాన్ని స్మరిస్తూ వుంటే, దైవం ఏం చేస్తాడంటే, ధర్మాన్ని అనుసరించేటట్లుగా స్ఫూర్తి నిస్తాడు. నీలో నియతి వృద్ధిపొంది సంస్కరింపబడి, పవిత్రీకరింపబడటం వలన ధర్మాన్ని అనుసరించే బుద్ధి పెరుగుతుంది. అదే 'ముక్తజీవుడు'. అందుకనే రామభక్తులు ముక్త జీవులుగా

ఉంటారు. లోపల ధర్మాన్ని, దైవాన్ని పట్టుకొని కూర్చుం డటం చేత వారినేదీ బంధించదు. ధర్మం అన్నా, దైవం అన్నా ఒకటే. దైవమే సృష్టి ధర్మంగా ఉంటాడు. ధర్మాన్ని అనుసరిస్తే, దైవంతో ఉన్నట్లే. పోతనామాత్యుడు భాగవతం వ్రాసి, రాజు పీడిస్తూ వుంటే వదిలేసి వెళ్ళిపోయాడు. అలాగే తులసీదాసు, తుకారాం, మొదలైనవారు కూడా. వారు ధర్మంలో జీవించడంచేత ప్రపంచం వారిని బంధించ లేదు. **"పాంక్తం వా ఇదగ్ం సర్వమ్ । పాంక్తే నైవ పాంక్తగ్ స్పృణోతీతి।"** అన్నారు. పంచ భూతాలు, పంచ తన్మాత్రలు, పంచ జ్ఞానేంద్రియాలు, పంచ కర్మేంద్రియాలలో తిరుగుతూండే వాళ్ళను యిది బంధించ కుండా వుంటే, ఈ సృష్టిని వైభవోపేతంగా అనుభూతి పొందితే, ఆ సృష్టివైభవం యొక్క అనుభూతే భగవంతుడిగా, రస స్వరూపుడిగా భావన చేసుకుంటాము. అందుకనే అతడు రసస్వరూపుడు. ఎవరికి రస స్వరూపుడు? ఈ సంసారంలో ఆనందం పొందినవాడికి సంసారం రస స్వరూపం. చేతకానివాడికి అది సమస్యల పుట్ట.

అలాగే శరీరాన్ని కూడా వాడవలసిన రీతిలో వాడినవాడికి సమస్తమైన సాధనలకు అదే మూలం. అలా కానివాడిని ఆ శరీరమే బాధిస్తుంది. ధర్మాన్ని అనుసరిస్తే మకరాలు కూడా అనుభూతి నిస్తాయి. అనుసరించకపోతే అవే మనలను పట్టేస్తాయి. ధనం వలన కూడా మనకు అనుభూతి ఉంటుంది. కాని ఆ ధనమే మనలను పట్టేస్తుంది. కనుకే ఏవైతే మనకు అనుభూతి నిస్తాయో, అందులో బంధింపబడే తత్వం కూడా కనిపిస్తూ ఉంటుంది. వెలుగు నిచ్చే విద్యుత్ 'షాక్' కూడా కొడుతుంది.

రాముడిని **"రామో విగ్రహవాన్ ధర్మః ।"** అన్నారు. అంటే రూపమే ధర్మ స్వరూపం. రామ స్తుతి, రామ ధ్యానం, రామ ప్రార్థన చేసేవారు నిర్భయంగా ధర్మంలో నిలబడిపోతారు. వారికి ఏ విషయంలోనూ, చివరకు మరణ విషయంలోనూ భయ ముండదు. అంత మహత్తరమైన నామం కాబట్టి రామాయణం ఈ భూమిమీద శాశ్వతంగా వున్నది. "భూమిమీద రామ నామం ఉన్నంతకాలం, నేను ఈ భూమి మీదే వుంటా'' నన్నాడు ఆంజనేయ స్వామి.

ఆంజనేయుడు మనలో బాగుంటే మనలో యోగం బాగా జరుగుతుంది. మనలో హనుమంతుని తత్వం ఏమిటి? అది దైవమును, జీవమును అనుసంధానం చేసే తత్త్వం. లంకంటే మన శరీరం. అందులో మనం బంధింపబడ్డవాళ్ళము. మనం ఉచ్ఛ్వాస, అంటే గాలి పీల్చినప్పుడల్లా హనుమంతుడు లంకలోకి వెళ్ళినట్లు, వదలినప్పుడల్లా జీవుడి పిలక పట్టుకొని, పైకి తెచ్చి ఆజ్ఞలో భగవత్ తత్వం దగ్గర చేర్చినట్లు చెబుతారు. అదే యోగంలో **'సో'** అని పీల్చి, **'హం'** అని వదల మంటారు. ఇలా రామ నామం జరిగే చోట ఆంజనేయుడి సహకారం లభించి *'సోஉహం'* (సః అహం) అంటే *'అతడే నేను',* అనే భావన ద్వారా జీవుడు ఊర్ధ్వగతి చెందడం సహజంగా జరుగుతుంది. ఎలాంటి భక్తి సాధన చేసినా, చివరికి జీవుడు తనకుండే శరీర బంధనాల నుండి ముక్తుడై ఆజ్ఞ యందు నిలబడాలి. అంటే తన సామ్రాజ్యాన్ని తాను ఆజ్ఞాపించే స్థితికి రావాలి. అందుకే లంకలో బంధింపబడ్డ వాడు హృదయంలోకి, అక్కడి నుండి ఆజ్ఞలోకి రావాలి. రాముని తలచుకున్నప్పుడల్లా

ప్రక్కన అమ్మవారు, లక్ష్మణుడు, హను మంతుడు గుర్తుకు రావాలి. అమ్మవారు ప్రకృతి. దారి చూపిస్తుంది. హనుమంతుడు అనుసంధానం చేసేవాడు. లక్ష్మణుడు రాముని యొక్క భక్తుడు. భక్తులను ఆరాధించడం వలన దైవం ప్రీతి చెందుతూ ఉంటాడు. అందుకనే గురువులను, ఋషులను, పెద్దలను వారి హృదయాలు రంజిల్లే టట్లుగా, హృదయము నందు సంతుష్టి పొందేలా మన ప్రవర్తన ఉండాలి. వారి రూపంలో ఆయన వుంటాడు కాబట్టి ఆయన సులభంగా సంతుష్టు డవుతాడు. మార్గం సులభ మవుతుంది.

అలా లక్ష్మణునిగూర్చి అవగాహన వున్నవాడు హనుమంతుడు. ఋష్యమూక పర్వతం మీదకు తీసుకు వెళ్ళేటప్పుడు ఇద్దరినీ సమానంగా చెరో భుజంమీద ఎక్కించు కున్నాడు. ఎందుకంటే లక్ష్మణుడు తాను వేరుగా కాక, రాముని (దైవం)తో వుండిపోయాడు. అందుకే విశ్వామిత్రుడు కూడా దివ్య అస్త్రములను బోధించి నప్పుడు రాముడి చెవిలో చెబితే, అవి లక్ష్మణుడికి కూడా అందాయి. విశ్వామిత్రుడు తనతో రాముడినే పంపమని అడిగాడు. లక్ష్మణుడు కూడా వచ్చేశాడు. విశ్వామిత్రుడు యాగరక్షణ చేయమని చెప్పింది ఎవరికి? రాముడికి. కాని, చేసింది రామలక్ష్మణుల రూపంలో రాముడే! అలాగే రాముడు, లక్ష్మణ రూపంలోని రాముడు విశ్వామిత్రుని వద్ద ఉపదేశం పొందారు. అది తెలిసినవాడు హనుమంతుడు. అందుకే హనుమంతుడు దైవంతో సమానంగా దైవభక్తుణ్ణి చూసుకున్నాడు. అలా చెయ్యక సుగ్రీవుడు దెబ్బ తింటాడు. భగవంతునికి ఎలాంటి ఉపచారాలు చేస్తామో, భక్తుడికీ

అలాంటి ఉపచారాలే చేయడం మన సంప్రదాయంలో, గురు పరంపరలో వచ్చింది. రామ పట్టాభిషేకం చిత్రంలో మన పెద్దలు ఇవన్నీ ఊహించి యిచ్చారు. 25 సంఖ్య కనుక 25 సార్లు రామ నామం వ్రాయండి. అది తారక మంత్రము. ఆయన తారక రాముడు కదా! అంటే తరింప చేసేవాడని అర్థం. మన చుట్టూ వున్న బంధాలను, ముడులను విప్పి, అనుభవాలను, అనుభూతులను, వైభవాన్ని యిస్తాడు. అలాంటి రామ నామాన్ని ప్రత్యేకించి పిల్లలలకు అందించాలి. బాలరామాయణం చదివించాలి.

**'విరామః' :**

విరామం అంటే చేస్తున్న పనుల నుండి తిరోధానం చెంది స్వస్థానానికి రావడమే. ఊళ్లో పనులన్నీ ముగించి యింటికి వస్తాము కదా! వెళ్ళినవాడు మరి రాలేక, అదే పనిమీద తిరుగుతున్నా డంటే, ఏమవుతాడు? ఖర్చయిపోతాడు. మనం ఖర్చు కాకుండా వుండా లంటే, విరామం యివ్వాలి. అలా సృష్టిలో సమస్తమైన అగ్ని కార్యానికి విరామం యిప్పిస్తూ ఉంటాడు. లేకపోతే అగ్ని మొత్తం దహించేస్తుంది. విరామంలో మళ్ళీ వనరుల యొక్క సేకరణ జరుగుతుంది. మళ్ళీ ప్రొద్దున్నే పుష్టిగా నిద్రలేస్తూ వుంటాము. భగవంతుడు ఈ కార్యాన్ని చక్కగా నిర్వహిస్తూ వుండటం చేత సృష్టి యిలా నిలచి ఉంటుంది. క్రీడారంగంలోకి ప్రవేశించిన క్రీడాకారుడు ఆట ముగిశాక వెనక్కి రావాలి. క్రీడలో కూడా విరామం ఉండాలి. ఇది తెలిసినవాడు ముందుకూ వెళ్ళగలడు, వెనక్కూ రాగలడు. 'విరామం' అనే నామం గుర్తుకు తెచ్చుకుంటే ఎప్పుడు, ఏ పనికైనా, ఎలా ముగింపు చేయాలో

తెలుస్తుంది. విరామంలో మన మేమిటో తెలుస్తుంది. అందుకే విరామం అన్నది భగవంతుడు చేసే పెద్ద ఉపకారం. మంచి పనులు చేస్తున్నాం అని మంచి భావనలో, రజస్సులో వుంటే, ఖర్చయిపోతారు. ఖర్చు కాకుండా ఉండాలంటే రజస్సు నుండి సత్వములోనికి రావాలి. అంటే విరామంలోకి రావాలి.

*“యోగః చిత్తవృత్తి నిరోధః।”* అన్నారు. యోగం అంటే ఏమిటి? బాహ్యారంగానికి కొంతసేపు తెరవేయటమే. బహిరంగంలో చేసే కార్యక్రమా లన్నిటికీ ఒక విరామం కల్పించడానికి సంబం ధించిన సాధనే యోగ సాధన. మనకు మామూలుగా ఉండవలసిన వాటిలో విరామం వుండదు. వేటియందు ఉండకూడదో వాటి యందు ఉంటుంది. ధ్యానము, ప్రార్థన, భగవంతునితో అను సంధానము చెందే విషయంలో ‘ఇక చాలు’ అనిపిస్తుంది. మనిషికి సమస్త విషయము లందు, తన ఆత్మతత్త్వము నందు కళ్ళెం వుండాలి. సాధనకు కూడా విరామస్థితి వస్తుంది. తాను ‘అది’ అయిపోయి, ‘అది’ తానైన సందర్భంలో ఇక చేసేదేమీ లేదని తెలుస్తుంది. సాధన నుండి కూడా ముక్తజీవుడికి ముక్తి.

ప్రతి విషయంలో కూడా మనం చేసే పనులకు ఒక గీత పెట్టుకోవాలి. పురుషమేధంలో “ముందు ధనం, తరువాత నలుగురి గుర్తింపు, ఈ రెండూ ఎప్పటికీ తెమలవు” అని చెప్తారు. గుర్తింపు వచ్చేకొద్దీ మనుషులు చేరుతూ వుంటే, వారందరినీ పట్టి వుంచడం గురువులు అనుకున్నవాళ్ళకు కూడా తెమలని విషయం. ఒకప్రక్క

ఇలా అన్నిటికీ నియమం పెట్టుకుంటూ ఉండి, ఇంకో ప్రక్క అంత రంగంలో ఉండడానికి సమయం పెంచుకుంటూ వెళ్తే, ఆ మొదటి దాన్ని *'వైరాగ్యం'* అని, రెండవదాన్ని *'అభ్యాసం'* అని అంటారు. ఈ అభ్యాసము, వైరాగ్యము అనేవి 'పక్షికి రెండు రెక్కల లాంటివి' అని శ్రీకృష్ణుడు చెప్పాడు. వీటిలో ఏ ఒక్క రెక్క ఆడించినా పక్షి, పైకి ఎగరదు. రెండు రెక్కలూ సమానబలంతో వినియోగించి నపుడు పక్షి పైకి లేస్తుంది.

అలాగే మూలాధారంలో వున్న మనపక్షి కూడా పైకి రావాలంటే, ఈ రెండూ కావాలి. లేకపోతే ఊర్ధ్వగతి లేదు. మంచి పనులు అంటూ పగటి నుండి రాత్రి వరకూ అలా అందులో పడి కొట్టుకు పోతున్నవారికి కూడా సత్యంలో ప్రవేశించే అవకాశం లేదు. అందుకని ఏ పని ఎక్కడ ఆపాలో తెలియాలి. అదే వైరాగ్యం. వైరాగ్యం అంటే అన్నీ వదిలెయ్యడం కాదు. అన్నిటి చుట్టూ మనం తిరగకూడదు. ఎవరి చుట్టూ తిరగాలంటే, ఆత్మతత్త్వం తెలిసిన వారి చుట్టూ తిరగాలి. అది కూడా నీలో ఆత్మసాధనకి స్థిరత్వం వచ్చేవరకు. ఆ తరువాత అక్కడ కూడా తిరుగవలసిన అవసరం లేదు. మనకై మనం దేని చుట్టూ తిరుగక మన దగ్గరకు వచ్చిన కర్తవ్యాన్ని నిర్వహిస్తూ వుండటమే వైరాగ్యం. మన దగ్గరికి వచ్చిన వారిని ప్రేమించాలి. ఆదరించాలి. వారికి మనకు చేతనైన సహాయం చేయాలి. లేకపోతే దండం పెట్టాలి. చేయలేనిది కూడా చేయగల మన్న భ్రమలో వుంచకూడదు. నీవల్ల ఏం చేతకాదో, అది చెప్పడం కూడా సహాయమే! కర్తవ్యం మేరకు మనుషుల వద్దకు వెళ్ళవలసి వస్తే, వెళ్ళాలి. వైరాగ్యం

వున్న చోట కుతూహలం కొద్దీ ఊళ్ళు తిరగడం, డబ్బు కోసం జీవితం తాకట్టు పెట్టడం ఉండదు. వైరాగ్యం కలిగినవాడు కేవలం జ్ఞానం కోసం పనిచేయాలి. దాని కొరకు సంబంధించిన సాధన చేయాలి. అందులో పెరుగుతూ ఉంటే, ఒక్కొక్క జీవ లక్షణానికి కొంత వైభవం వస్తుంది. కీర్తి రావచ్చు కాని, కీర్తి కోసం పని చేయడం వుండదు. ఎవడైతే మనందరికీ పుట్టుక స్థానమో, వాడి కోసం మాత్రం ఉండి, వాడిలో ఉండి, తనకు కాలం రూపంలో నిర్దేశింపబడిన కర్తవ్యాలను నిర్వహిస్తూ ఉండటం వైరాగ్యం. అలాంటి విరాగులకు సాధనకు సమయం దొరుకుతుంది. సాయంత్రం 15 నిముషాల పాటు ప్రార్థనా సమయం దొరకటం ప్రశ్నార్థకంగానే ఉంటుంది. ప్రార్థనను ఏ విధంగా మానేస్తే బాగుంటుందో అని మనసు ఆలోచిస్తూ వుంటుంది. పట్టుదలగా అభ్యాసం చేస్తూంటే వైరాగ్యం వస్తుంది. వైరాగ్యం పెంపొందించుకుంటే అభ్యాసం బాగా వృద్ధి చెందుతుంది.

ఈ రోజుల్లో చాలా మందికి భక్తి పేరున వైరాగ్యం కాక సంసారం పెరుగుతూ ఉంది. ఏ మాత్రం వైరాగ్యం ఉందో చూసుకోవాలంటే, రోజూ మనం చేసే పనులలో ఎన్ని అవసరమైన పనులున్నాయి? ఎన్ని అనవసరమైన పనులు చేశాం అని చూసుకోవాలి. అవసరమైన పనులు చేస్తే సాధనకు సహాయంగా ఉంటుంది. సాధన చేస్తూ వుంటే వైరాగ్యము వస్తుంది. అందుకని పతంజలి మహర్షి యోగ సూత్రాలలో చెప్పిన ముఖ్యమైన భాగం అభ్యాసము - వైరాగ్యము. జ్ఞాన యోగంలో కృష్ణ పరమాత్మ చెప్పిన భావం కీలక సూత్రం అభ్యాసం - వైరాగ్యం. ఈ రెండూ కలిపి మనకు

విరామంగా ఉంటుంది. అలవాటుపడిన పనిచేయకపోతే తోచని వారు చాలామంది ఉంటారు. *'అంతర్యాగం'* అంటారు. బయట ఆగం తగ్గి లోపలి 'యాగం' పెంచా మంటే, అదే స్ఫూర్తి. మనస్సుకి, ఇంద్రియాలకు, కోరికలకు నియమం ఏర్పడుతుంది. వీటిన్నిటికీ నియమం ఏర్పడితే వాక్కుకి నియమం ఏర్పడుతుంది. అలా నియమబద్ధమైన జీవితం ఏర్పడుతుంది. వెంపర్లాట తగ్గి, విరామం పెరిగి మనిషి సత్వగుణంలోకి ప్రవేశించడానికి అవకాశం ఏర్పడు తుంది. సత్వగుణంలో వున్నవాడు చక్రంలో తాను తిరగక, తిరుగు తున్న చక్రాన్ని చూస్తూ ఉంటాడు. జరుగుతున్నది తాను చూసే స్థితిలోకి సత్వగుణ సంపన్నుడు ఎదగడానికి అవకాశ మున్నది.

మనం చేస్తున్న పనులలో అలసట ఉందా? ఆనందం వుందా? మనం వైరాగ్యంలో వున్నామని ప్రపంచానికి తెలియనక్కరలేదు. వైరాగ్య మంటే, అవసరమైనవాళ్ళు వచ్చినా, మాట్లాడకపోవటం, కర్తవ్యం మానెయ్యడమూ కాదు. కర్తవ్యం చేసి స్ఫూర్తితో ఉంటే, సాధనకు సమయం మిగులుతుంది. ప్రపంచంలో ఎప్పుడూ ఏదో ఒకటి క్రొత్తది కనిపిస్తూనే ఉంటుంది. ఎన్ని రామాయణాలు వ్రాసినా, సాధన అనేది నువ్వే మొదలుపెట్టాలి. పుస్తకాలలో బయటి ప్రవర్తన ఎలా ఉండాలో ఎక్కువ చెబుతారు తప్ప అంతర్యాగం గురించి ఎక్కువగా చెప్పరు. అంతర్యాగం గురించి కేవలం తెలిసిన వాళ్ళు వాక్కుగా అందిస్తారు. జీవితం అంతర్, బహిర్యాగములుగా నడవాలి. మనస్సును శ్వాస యందుంచి, మనస్సు, శ్వాస ఏక మవడం వలన స్పందనంగా తనకు తాను తెలుసుకొని, ఆ స్పందన స్థితిలో

ఉండటం మొదలు పెట్టి అక్కడి నుండి సూక్ష్మ స్పందనం లోకి వెళ్ళడం అంతర్యాగం. దానికి ప్రాణాయామం అనేది చాల ముఖ్యమైన కార్యక్రమం. ఉదయం **24** నిమిషాలు, సాయంకాలం **24** నిమిషాలు ఎవరికీ తెలియకుండా ప్రాణాయామం చేసుకోవచ్చు. శ్వాస, మనోప్రవృత్తి ఈ రెండూ - ఒకటి కావాలి. దానికి సాధన చేయాలి. సాధన ద్వారా ఆ రెండూ ఒకటి కావడం వలన మనిషి కూడిక చేయబడిన వాడవుతాడు. ప్రాణ ప్రవృత్తులు, శ్వాస, స్పందనం - యివన్నీ ఒక లోకం. అవి నడుస్తూ ఉంటాయి. మనసు, ఇంద్రియాలు, ఆలోచనలు, పనులు - ఇవి యింకో ప్రక్క నడుస్తూ ఉంటాయి. ఈ రెండూ కలవవు. ఒకదాని నొకటి పాడు చేస్తుంటాయి.

అలా జరగకుండా ఉండాలంటే సూర్యోదయం, సూర్యాస్తమయాల్లో మనసును శ్వాసమీద లగ్నం చేస్తే మనసు పరుగు పెట్టడం తగ్గుతుంది. ఆవేగం తగ్గి, మనిషి ప్రశాంతంగా తయారవ్వడానికి అవకాశం ఏర్పడుతుంది. అప్పుడు తన ఆలోచన లకు విరామం యివ్వగలిగినవాడు ఈ విరామ స్థితిని పొందుతాడు. తాను ఎట్లా ఉన్నాడో, తనకు తెలుస్తుంది. తాను వెలుగుతూ వుంటాడు. వెలగక కూడా ఉంటాడు. తాను సత్యమై చైతన్యవంతు డవుతూ ఉంటాడు. అంటే 'ఉండటం'లో మిగిలి ఉంటాడు. పని లేకపోతే మళ్ళీ సమాధి స్థితిలోకి వెళ్తాడు. నిజమైన విరామం ఎవరు చెందుతున్నారయ్యా అంటే, సమాధి స్థితిలో వున్నవారు మాత్రమే. వారియందు రజస్సు ఎప్పుడూ అలా పనిచేస్తూ వుండదు. రజస్సు సత్వములోనికి, సత్వము సత్వాతీత స్థితిలోనికి యిమిడి ఉంటుంది.

ఇది గుర్తు పెట్టుకోవాలి. మనం సహజంగా శుద్ధ చైతన్య స్వరూపులమైనా, సత్వము, రజస్సు, తమస్సు అనే త్రిగుణముల లోనికి మూడుగా విభజింపబడుతాము. అక్కడి నుండి వరుసగా రజస్సు, తమస్సుల లోనికి జారుతుంటాము కాని మళ్ళీ తమస్సు నుండి రజస్సుకి, రజస్సు నుండి సత్వములోకి, సత్వము నుండి సత్వాతీత స్థితిలోనికి ఎగబ్రాకాలి. ఆ సత్వాతీత స్థితిలోనే మనసుకి, ప్రాణప్రవృత్తులకి విరామం.

**'విరజః' :**

రజ అంటే రజస్సు. 'విరజః' అంటే రజస్సును అధిష్ఠించి వున్న విశేషమైన స్థితి. రజస్సు నుండి దానికి అతీతమైన స్థితిలోనికి వెళ్ళినవాడు అని మరొక అర్థం. ఇలా వైరాగ్యం, అభ్యాసం రెండూ చేసుకుంటూ ముందుకు వెళ్తే, మనిషి స్థూలమైన పదార్థ స్థితి నుండి సూక్ష్మమైన పదార్థ స్థితిలోనికి ఎదుగుతాడు. దానిని 'విరజ' అంటారు. మామిడిపండు చూశాం కాని అది అలా రావడానికి జరిగిన యజ్ఞం ఎవరు నిర్వర్తించారు? ఈ కనబడుతున్న దాంట్లో, కనబడకుండా జరుగుతున్న వెలుగుయొక్క యజ్ఞం తెలియాలంటే, మనిషి స్థూలస్థితి నుండి సూక్ష్మస్థితికి వెళ్ళాలి. నిజానికి సూక్ష్మస్థితి లోనే సమస్తమూ జరిగి, స్థూలమైన స్థితిలో అది ఏర్పడి ఉండటం కనబడుతుంది. స్థూలస్థితికి కారణమైన సూక్ష్మస్థితి మనకు పురుష సూక్తంలో యిచ్చిన పెద్ద రహస్యం. *"త్రిపాదస్య అమృతం దివి ।, పాదోస్య విశ్వాభూతాని ।"* ఒక పాదమే ఈ కనిపించే విశ్వము,

భూతములు. ఈ కనిపిస్తున్న జీవులు, గ్రహ గోళములు ముందు మూడు స్థితులలో యజ్ఞం జరుగుతోంది. నాలుగవ స్థితిలో యివి కనిపిస్తున్నవి. దీనినే పరా, పశ్యంతి, మధ్యమ, వైఖరి అని స్థూలస్థితిగా చెప్తారు. భాషలో భావం వుండకపోతే, మాట రాదు కదా! మాట్లాడక పోయినంత మాత్రాన మన మంతా మౌనంగా వున్నట్లేనా? మౌనంగా వున్నప్పుడు మానసికంగా ఎక్కువ మాట్లాడు కుంటాము. భాషకన్నా ముందు భావం రూపంలో ఉంది. అంతకంటే ముందు అదృశ్యంగా ఉంది. మన నుండి వ్యక్తమై భావంగా వచ్చి, భావం నుండి భాష వచ్చి, భాష నుండి మాట వస్తే, అవతలివాళ్ళకు తెలుస్తుంది. ఆ ముందు మూడూ ఎవరు చూశారు?

మామిడి పూత పూసినపుడు, పూయక ముందు, చెట్టులో ఏ రకమైన, సూక్ష్మ లోకాలలో, ఎలాంటి రసాయనిక ప్రక్రియ జరిగిందో తెలిసిందా? అలాగే మనలో కూడా వెలుగు దారు లున్నాయి. వాటినే 'నాడీ మండలం' అంటారు. దాని ఆధారంగా ఎన్నో పనులు చేస్తూ వుంటాము. కనబడి జరిగేదానికి, కనబడ కుండా వున్నది వుంది. వాటినే మనం పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరీ అని, వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ వ్యూహము లుగా, ఆత్మ, బుద్ధి, మనస్సు, బహిర్గతమైన చేతనగా చెప్పు కుంటాము. వాటినే 4 వేదా లన్నారు. **ఋగ్వేదం** అంటే, మొదటి స్పందన (సంకల్పం). అది ఆధారంగా **సామవేదం**. దానివలన శ్వాస, సంకల్పము. శ్వాస ఆధారంగా భావము. అది **యజుర్వేదం**. భావం ఆధారముగ బాహ్యంలో మాటలు, పనులు జరుగుతాయి. అది

అథర్వణ వేదం. మూడు కనబడక, నాలుగవది కనబడుతుంది. ఆ కనబడనిది ఏ సమయంలో కనబడేదిగా మారుతున్నది? మీలో వాక్కు ఎలా వ్యక్తమవుతున్నది? నిశ్శబ్దం శబ్దంగా ఎక్కడి నుండి మారుతున్నది? కంఠం నుండా? లేక హృదయం నుండా? ఎక్కడ ఏ మార్పు జరుగుతున్నదో తెలుస్తుందా? అదృశ్య లోకాలనుండి దృశ్య లోకాల్లోకి వచ్చే సంగమ స్థానాన్ని "విరజ" అంటారు.

గంగను 'విరజానది' అని కూడా అంటారు. ఎందుకంటే ఆ నీరు ఆకాశంలో విద్యుత్తుగా వుండి భూమి మీదకు వచ్చేసరికి నీరుగా తయారవుతుంది. పురుషోత్తమప్రాప్తి యోగంలో శ్రీకృష్ణుడు చెప్పేది అదే. ఈ చెట్టుకి వేళ్ళు పైన, కాండము క్రింద, శాఖలు ఇంకా క్రిందకు, రెమ్మలు, రెమ్మలకి ఆకులు, ఇంకా క్రిందకి వున్నాయి. సృష్టి ఎప్పుడూ అదృశ్య లోకాలనుండి దృశ్య లోకాల్లోకి నాలుగు స్థితులలో దిగి వస్తుంది (అలాగే రామాయణంలో పర తత్త్వము నలుగురుగా దిగివచ్చారు. వారే రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు). నిజమైన సాధన చేసేవా రెప్పుడూ దృశ్యమాన లోకానికి విలువ నివ్వరు. జీవితం కొంచెం వేడెక్కితే తప్ప కరగము. మనిషి కష్టాలలో కరగినట్లుగా సుఖాలలో కరగడు. బంగారానికి వన్నె ఎప్పుడొస్తుంది? కొలిమిలో పెట్టి కాలిస్తే, ధగధగ లాడుతుంది. 'విరజ' అన్నది స్థూలస్థితికి వచ్చే ముందు సూక్ష్మస్థితి లాంటిది. ఆత్మ తత్త్వం కూడా అలా ఉంటుంది. అక్కడి నుండి బుద్ధి తత్వంలో వెలుగుగా వస్తుంది. వెలుగు నుండి భావం వచ్చి, భావం నుండి మాట, చేత - అలా నాలుగు రకాలుగా దిగివస్తాము.

మనలో పరమాత్మ ఉన్నాడు. అతడు వాసుదేవుడు. అతని అంశగా మనము దిగి వచ్చాము. కనుక మనము సంకర్షణులం. మనలో దైవము బుద్ధి యేర్పరచాడు. అలా ప్రద్యుమ్ను డున్నాడు. మనలో చిత్త మున్నది. దాని ఆధారముగానే క్రియలు నిర్వర్తిస్తూ వుంటాము. అదియే అనిరుద్ధుడు. ఇట్లే ప్రతి మనిషీ నాలుగు వ్యూహాలతో నిర్మాణం చేయబడ్డాడు. ఈ నలుగురూ సహకరించి పనిచేసుకుంటే జీవితము రామ రాజ్యం అవుతుంది.

వాసుదేవుడుగా శ్రీరాముడు, సంకర్షణుడుగా లక్ష్మణుడు, ప్రద్యుమ్నుడుగా భరతుడు, అనిరుద్ధుడుగా శత్రుఘ్నుడు, ఒకరి కొకరు సహకారము అందించుకోవాలి. అదే రామాయణం. నాలుగు వేదాలే నలుగురు సోదరులు. పరమాత్మ నాలుగు వ్యూహాలే వారు. వారే సృష్టి వ్యూహములో నలుగురు కుమారులుగా సనక సనంద నాదులుగా ఉన్నారు. ఆ నలుగురే అంతఃకరణ చతుష్టయము కూడా. ఆ నాలుగే నాలుగు యుగాలు. నాలుగూ కలిసి మెలసి వుంటే, పూర్ణస్థితి. **"1 + 2 + 3 + 4 = 10"** అని పరమగురవు పైథాగరస్ చెప్పారు. దీనినే వేదములలో పది అంగుళముల పురుషుడుగా చెప్పారు. ఇదంతా రామాయణములో ఉందని పురాణము చెప్పే వారికి తెలియదు. రామకథ సృష్టి కథే. అందు ఆరు కాండములు షట్చక్రములే. అందులో సుందరకాండ నాలుగవ ప్రత్యేక వైభవం. దాని రహస్యాలు ఇదివరకు కొన్ని చెప్పుకున్నాము.

మన శరీరంలో కూడా కనబడనిది కనబడేదానిగా చేయడానికి కావలసిన యంత్రాంగం ఉన్నది. "నీ శరీరంలో పైనుండి క్రిందకు

క్రొత్త మార్పులు తెచ్చి శరీరాన్ని పునర్నిర్మాణం చేసుకుంటాను'' అని చెప్పినవారిలో మాస్టర్ సి.వి.వి. అగ్రగణ్యులు. “నీ శరీరాన్ని నేను మారుస్తాను. మరమ్మత్తు చేస్తాను. కాసేపు నేను చెప్పినట్లు కూర్చో!'' అన్నారు. అందులో ఒక ఉన్నతమైన యోగ సాధన వుద్దేశింపబడి వున్నది. దాన్ని ఊరకే మూర్ఖంగా చేసుకుంటే కాదు. వైజ్ఞానికంగా తెలియాలంటే, పరమగురువు జ్వాలాకూలుడు రచించిన పుస్తకాలు అధ్యయనం చేయాలి. వాటిని సాధన చేసి తన వెలుగు శరీరాన్ని దర్శించినవాడు చెప్పగలడు. మనం కామ మయ లోకానికి కాక ప్రాణమయ లోకానికి వంతెన వేసుకోవాలి. అదీ bridge.

ఇదంతా మూలాధారంలో జరిగే కార్యక్రమం. మూలాధారంలో మనకి ఒక ముడి వేయబడి ఉన్నది. సూక్ష్మలోకాల నుండి ప్రాణశక్తిని అందించే గొట్టం, అంతకంటే పైన వున్న స్వాధిష్ఠాన చక్రంతో సంబంధం కలిగి వుంటుంది. కామం తీరితే రాగం, తీరకపోతే ద్వేషం. వీటిని emotional planes అంటారు. తీరనివన్నీ ఒక బాధగా ఉండి, కళ్ళు మూసుకున్నా అదే గుర్తొస్తుంది. శరీరంలో ప్రాణశక్తి ప్రసరిస్తూ ఉంటే, అగ్ని కారణంగా ధాతువులలో మార్పు వస్తుంది. మనలో సూక్ష్మం నుండి స్థూలానికి రావడానికి ఏడు మెట్లు వున్నాయి అనుకున్నాము కదా! అందులో మధ్య మెట్టు నాలుగవ మెట్టు అవుతుంది. ఆ నాలుగవ మెట్టువద్ద కనబడనిది, కనబడేది అవుతుంది. మనకు చెప్పిన ఏడు లోకాలలో కూడా ఈ నాలుగవ లోకంలోనే కనబడనిది కనబడేదిగా అవుతుంది. కనబడనిది,

కనబడేదిగా అయితే, దానిని *'బుద్ధి లోకము'* అన్నారు. బుద్ధిమయ లోకం క్రింద మనోమయ లోకం, దానికన్నా క్రింద భౌతిక లోకం ఉంది. క్రిందికి అంటే స్థూలంలోకి వెళ్ళడం అనే. బుద్ధికి పైన ప్రశాంతంగా ఉండటం వలన ఆనందం కలిగించే లోకం ఐదవ లోకం. అదే ఆనందమయ లోకము. ఆరవలోకంలో జీవుడు, ఏడవ లోకంలో దేవుడు వుంటారు. బుద్ధికిపైన ఆనందము, జీవుడు, దేవుడు ఉంటారు. హావ భావాలలో తప్ప, మనలో వున్న ఆనందాన్ని చూపించ గలమా?

అలాగే సప్త ధాతువులలో కూడా, నాల్గవ స్థితిలో సూక్ష్మ శరీరానికి, స్థూల శరీరానికి రెంటికీ వంతెన కట్టబడి ఉంటుంది. మనం కామలోకానికి ఆనకట్ట కడితే, రెండవదారి నుండి ప్రాణ శక్తి స్ఫూర్తి నిచ్చు వెలుగుదారిలో ప్రవేశపెడుతుంది. ఆ విధంగా మనిషి నెమ్మదిగా వెలుగులోనికి ప్రవేశించడం జరుగుతుంది. ప్రవేశిస్తే, వారంతా విదేహులై ఉంటారు. విశిష్ట దేహం కలిగినవారిని *'విదేహులు'* అంటారు. వాళ్ళకు ఈ దేహం ఉన్నా, లేకపోయినా సంబంధం ఉండదు. ఈ విధంగా మనలో మార్పు చేసుకోవాలి. మార్పు జరిగిందనడానికి సంకేతం మనలో ఉద్వేగాలు తగ్గడమే. తీవ్రమైన కోరికలు, పట్టుదలలు, మమకారాలు, ద్వేషాలు, మదము, అసూయ, లోభత్వము పెట్టుకొని దైవారాధన చేస్తే అది సమయాన్ని వృథా చేయడమే. ధర్మ ప్రవృత్తి కలగాలంటే ఇది తగ్గాలి. సాధన అలా జరగాలి. ధర్మప్రవృత్తి లేకుండా సాధనకు అవకాశం లేదు. "నేను అధర్మంగానే ఉంటాను. నీవు నన్ను ముందుకు తీసుకు

వెళ్ళు'' అంటే కుదరదు. ధర్మంవైపు మళ్ళించే ఆరాధనే సరియైన ఆరాధన. ప్రవృత్తిలో మార్పు జరిగితే సాధన జరిగినట్లే. ఆ మార్పు ఎవరికి కనబడాలి? ముందు మనకి కనబడాలి. అది మనని చూసిన బయటివాళ్ళు చెప్తారు. 'విరజ' స్థితిలో మనం క్రమశః బండగేదె తత్వం నుండి కోమలమైన హంస స్వరూపులుగా తయారవుతాము. ఆ భావనలోనే ఎంత తేడా ఉందో!

మనం గొంగళి పురుగును, సీతాకోక చిలుకను చూశాము కదా! గొంగళి పురుగే సీతాకోక చిలుక కదా! ఆ గొంగళి పురుగు ఊరికే తిరక్కుండా ఒకచోట కూర్చుని అంతా కట్టుకుంటూ వచ్చింది. అందులో కొన్నాళ్ళుంది కదా! ఆ తరువాత సీతాకోక చిలుక అయింది. అదీ సాధన! సీతాకోక చిలుక మన ఒంటిమీద వాలితే ఎంత ఆనందంగా ఉంటుంది! కొంత సంతోషంగా, కొంత గర్వంగా కూడా ఉంటుంది. గొంగళి పురుగు- సీతాకోక చిలుక లాగా మనం కూడా స్థూల శరీరం నుండి సూక్ష్మ శరీరం లోనికి అలా మార్పు చెందే ఒక పద్ధతి ఉన్నది. ఒక సాధన ఉన్నది. అది మన కివ్వడం కోసమే మాస్టరుగారు వచ్చారు. పరమగురువుల మార్గానికీ, మిగిలిన మార్గాలకీ తేడా ఉంది. ఇక్కడ నుండి అక్కడికి దారి ఉంది (అంటే స్థూలం నుండి సూక్ష్మానికి). అంత మాత్రంచేత మనమంతా పవిత్రులం కాదు. Emotional body కి, Physical body కి ఉండే వంతెన పగులకొట్టి, pranic / vital body కి, physical body కి వంతెన నిర్మాణం చేసుకుంటే ఆ ప్రాణశక్తి ప్రవాహంలోకి ప్రవేశించి, ఆ వెలుగు లోకాన్ని అధిష్ఠించి వుండవచ్చు. ఉంటే, అక్కడి

నుండి జరిగేవన్నీ చూసే స్థితి కలుగుతుంది. అంటే, బుద్ధిలోకాలలో వసిస్తాము. అక్కడి నుండి మనస్సు, ఇంద్రియాలు, శరీరము చేసే కార్యక్రమాలు పర్యవేక్షిస్తూ ఉంటాము. మాస్టర్ సి.వి.వి. ఏం చెప్పారంటే, "కనులు మూసుకొని నీ లోపల కదలికను గమనిస్తూ ఉండు. 'నాకిది కావాలి' అన్నది మరచిపోతేనే నువ్వు నా యోగంలో వున్నట్లు. నీకేం కావాలో మరచిపో! ఇతరులకు ఏం కావాలో చూడు. నీ కొరకు కాక ఇతరుల కొరకు నువ్వు జీవించడం మొదలుపెడితే నువ్వు నా యోగంలో వున్నట్లు. ఆ ఇతరులు ఎవరో కాదు. అంత్యరామియే అన్ని రూపాలలో ఉన్నాడు" అని చెప్పారు.

"ఇతరుల రూపంలో కనిపించేదంతా వాడే! అదే 'నేను'. 'అహమస్మి'. ఇతరులకు సేవ చేస్తున్నాననే వ్యామోహంలో పడక, నాకే సేవ చేసుకుంటున్నాననే వినయంతో వుండు. ఇక రెండవది నీ కోసం పనిచెయ్యడం మానెయ్యి. ఇతరులకు చేస్తే నీ కోసం పని చేసే దేవతాశక్తులు చాలచోట్ల ఉన్నాయి. మనకు సహాయం చేస్తాయి. మూడవది ~~ఈ~~ అంతర్ దృష్టి ఏర్పరచుకొని లోపల జరుగుతున్న కదలికలను గమనించు. అలా త్రికరణశుద్ధిగా **12** సంవత్సరాలు పనిచేస్తే నీలో వెలుగు శరీర నిర్మాణం జరిగే బాధ్యత నేను స్వీకరిస్తాను" అని చెప్పారు. ఇదంతా 'విరజ' పదానికి సాధనా పరమైన వివరణ.

అదే మనకి మంద్రజాలంలో మళ్ళీ మాస్టర్ ఇ.కె.గారు చెప్పారు. జ్వాలాకూలుడు గిరిశర్మగా చార్వాక ఆశ్రమంలో వున్నప్పుడు తను జ్వాలాకూలుడని తెలియదు. జ్వాలాకూలుడిగా ఉన్నప్పుడు

గిరిశర్మననీ తెలియదు. మనం కూడా అంతే! జీవ లక్షణంతో జీవుడిగా ఒక కార్యక్రమం పెట్టుకొని వచ్చాము. ఆ పని మానేసి యింకో పని మొదలు పెట్టుకున్నాము. అది తెలుసుకోవాలి. జీవుడిగా మన గురించి మనకు తెలియాలి తప్ప, దేహాత్మ భావంతో కాదు. అసలు జీవుడిగా మనం ఎవరు? ఈ శరీరంలోకి రాక ముందు నేనెవరు? అప్పుడేం చేసేవాణ్ణి? ఎందుకు వచ్చాను? ఏం చేస్తున్నాను? అది మరచిపోయి ఏదో చెయ్యడంగా ఎన్నో జన్మలు జరిగిపోతూ ఉంటాయి.

ఈ వెలుగు శరీర నిర్మాణం చేసుకొనే అవకాశం ఒక్క మానవ శరీరానికే వుంది. భగవంతుడు వెలుగు శరీరంలో వుంటూ, అవసరమైనప్పుడు భౌతిక శరీరంలోకి వస్తాడు. అలాగే మహాత్ములు కూడ. అవసరం లేకపోతే వెలుగుగానే ఉంటారు. అట్లా భగవంతుడే కాదు. విదేహ సామ్రాజ్యంలో వున్న వారంతా అలాంటివారే. విదేహ రాజ్యం జనకుడిది కదా! జనకుడిని కృష్ణు డంతటివాడు భగద్గీతలో వివరించాడు. జనకుని పట్టణం ఏమిటి? మిథిల. మిథిల అంటే బాగా మథనం చేయబడటం చేత, సాధన ద్వారా ఏర్పడిన వెలుగు. మథనం చేస్తే ఏం వచ్చింది? అమృతం వచ్చింది. ముందు మాత్రం విషమే వచ్చింది. అలాగే సాధన మొదలుపెడితే చాలా అడ్డంకులు వస్తాయి. చాలా బాధలు వస్తాయి. అది నీ లోపలే దాగి ఉంది. ఉంగరం పడిపోయిందని బావిలో దిగితే అంతకు ముందు పడ్డ చెంబులు, తప్పేలాలు దొరకుతాయి. అట్లాగే మనలో కూడా అవసరం లేనివి చాలా వున్నాయి. అవన్నీ బయటికి పారేసి, అమృత

స్థితిని యిస్తారు. ఆ చావులేని స్థితినే వెలుగు శరీర నిర్మాణం అని పరమగురువులు అంటారు. దానినే అంతఃకరణ శరీరము, భాగవత శరీరము అంటారు. అందులో ఉండేవారంతా చిరంజీవులే. వాళ్ళ దర్శనం జరిగితే అప్పుడు సత్యం తెలుస్తుంది. మనకు కనబడదు కాబట్టి, సందేహించి సత్యం కాదనుకోవడం అంత తెలివైనపని కాదంటారు మన పెద్దవాళ్ళు. మహాత్ముల అనుగ్రహం ఏమిటంటే మురికిలోకి వచ్చి, మురికి మనుష్యులతో పనిచెయ్యడం. మనిషికి భావం మురికి. కోరికల్లో మురికి. శరీరంలో మురికి. పరిసరాల్లో మురికి!

మరువు మహర్షిని ''How can I believe that subtle body is true?'' అని ఒక అమెరికన్ అడిగాడు. దానికి ఆయన “పాలలో వెన్న ఉందా?'' అని అడిగితే ఆయన “ఉంది'' అన్నాడు. “కనబడు తుందా?'' అంటే “లేదు'' అన్నాడు. మళ్ళీ “చిలికితే కనబడుతుంది'' అన్నాడు. అయితే “చిలుక్కో!'' అన్నాడు మహర్షి. అలాగే మనలను మనం చిలుక్కుంటే మనలోని 'వెన్నముద్ద' కనిపిస్తుంది. కనబడని దానినుండి కనబడే స్థితికి మారే దానిని 'Fulcrum point' అంటారు. అది బుద్ధి లోకం. అక్కడున్నవాడికి పైనుండి వచ్చే ప్రణాళిక నిర్వర్తించడమే తప్ప, తనదైన పనుండదు. 'విరామ', 'విరజ' అనే నామాలు సాధనలో ఉత్తమ తత్వాన్ని తెలియజేసేవి. భగవంతు డెప్పుడూ విరామంలో వుంటాడు. అలా విరామంలో వుంటూ, అవసరమైనప్పుడు దిగి వచ్చేవాడు యోగి. అందుకనే ఒక మహాత్ముడు ఎంతో నిశ్శబ్దంగా, నిర్మలంగా ఒకచోట పనిచేసి వెళ్ళిపోతే, అది

భూమి అంతా పాకేస్తోంది. అందుకని లోతులు పెంచకోవడం ద్వారా పరిధులు పెంచుకోవడం ఆధ్యాత్మికత. తపస్సు లేని సేవా కార్యక్రమాలకు లోతు వుండదు. వాటికి ఆయుర్దాయమూ ఉండదు.

**రామాయణంలో అమ్మవారు 'విరజ'. అయ్యవారు 'విరజుడు'. రజోగుణ దోషం అంటనివారు. సీతమ్మ వున్న రాజ్యం విదేహ రాజ్యం! అంటే పుట్టుకతోనే ఆమె విరజ. దివ్యశరీర ధారిణి. లోకహితం కోసమే పుట్టింది. అందుకే వనవాసానికి స్వచ్ఛందంగా వెళ్ళింది. ఆమె వనవాసానికి వెళ్ళకపోతే రామకథే లేదు. రాక్షసవధే లేదు. "నేను రాకపోతే ఎలా? నేను రావాలి కదా !" అని రాముని హెచ్చరించినది సీతమ్మే. రామాయణం నిజానికి రమాదేవి చరిత్ర. కాబట్టి రామాయణ మైంది. రమా, రాముల కథ అది. రమ అయిన సీతమ్మ విరజ. రాముడు విరజుడు.**

**'మార్గః' :**

ఈ నామంలో భగవంతుడే మార్గమని గోచరిస్తుంది. మనం దేనియందు ఆసక్తి కలిగి వున్నామో, దేనిని పొందాలనే ప్రయత్నంలో ఉన్నామో దానికి భగవంతుడే దారి అని తెలిసి ఉండటం విజ్ఞత. అప్పుడు మనకు, మనయందున్న భగవంతుడే దారి చూపిస్తాడు. స్ఫూర్తి నిచ్చి నడిపిస్తాడు. ఎందుకంటే తనే దారి అని మనకు తెలియాలనే స్థితి కూడ కర్మవశాత్తు మనకు కల్పించి *"నీవే తప్ప నితఃపరం బెఱుఁగ మన్నింపందగున్ దీనునిన్"* అన్న పద్ధతిలో దిక్కు తానై నిలచి వుంటాడు. ధర్మరాజుకు, అర్జునుడికి, ద్రౌపదికి

ఇలాగే పరిష్కారం దొరికింది. భగవంతుడు మనకు ఉపాయమై నిలచి ఉన్నాడు. మనలను రక్షిస్తాడు. మనవంతు కర్తవ్యాన్ని నిర్వహిస్తే, మన సమస్యలను పరిష్కరిస్తాడు. భగవద్భక్తికి దారి, దిక్కు దొరక్కపోవడం అన్న ప్రశ్నే లేదు. భారత, భాగవత, రామాయణాలు చెప్పేది యిదే. కష్టాల బరువు ఎక్కువైనప్పుడు విశ్వాసం కొంత తగ్గుతుంది. కాని భగవంతుని మీద విశ్వాసం పెరిగినప్పుడు సమస్యలు చిన్నవిగా కనిపిస్తాయి. సమస్య పెరిగే కొద్దీ మనం భగవంతుని తగ్గించు కుంటూ సమస్య గురించే ఎక్కువ ఆలోచన చేస్తాము. ఆ ఆలోచనతోనే ప్రార్థన చేస్తాం. ప్రార్థన తరువాత మళ్ళీ సమస్య సమస్యే!

నిజమైన భగవద్భక్తులు సమస్య రాగానే, తాబేలు తనలో తాను యిమిడినట్లుగా, భగవంతునిలో యిమిడిపోతారు. అందుకే కుంతీదేవి తనకు ఎప్పుడూ కష్టాలు వుండేలా వరం కోరుకుంది. కష్టాలు కూడా తనను చేరడానికి ఒక మార్గమేనని భగవంతుడు చెప్పాడు. భగవంతుని యందు మన ముండి వేచి ఉండాలి. మన కర్తవ్యం చేశాక కూడా ఫలితాన్ని కాలానికి వదిలెయ్యాలి. మన కర్తవ్యం మేరకు యోగసాధన చేద్దాం. ఆయనే దారి. ఆయనే నడిపిస్తారు. దారి తెలిసినవారు వుంటే, వారి వెంట వెళ్ళడమే భక్తుని ఉపాయం. జ్ఞాని జ్ఞానమార్గంలో తన దారి తానే చూసుకుని నడుస్తాడు. భక్తుడికి భగవంతుడు కొంత కూలిపని చేస్తే, జ్ఞాని తనకు తానే కూలీ. ఈ తేడా కనిపిస్తుంది. మన సంసారం కూడా అప్పగిస్తే అదికూడా చూసుకుంటాడు.

మాస్టర్ సి.వి.వి.గారు "నాకు అప్పచెప్పిందల్లా నేను చూసు కుంటాను. నువ్వు చేసుకుంటానంటే వదిలేస్తాను. నే నెప్పుడూ అడ్డురాను'' అన్నారు. కాని మనం మనకు చేతనైంది చేసి, చేత కానిది అప్పజెప్పుతాము.

"అనన్యాశ్చింతయంతో మామ్ యే జనాః పర్యుపాసతే ।
తేషాం నిత్యాభియుక్తానాం యోగ క్షేమం వహామ్యహమ్ ॥"

సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।
అహంత్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః ॥"

అన్నాడు కదా శ్రీకృష్ణుడు! "అజ్ఞానంలో వున్న నిన్ను నేనే సంస్కరించుకొని, ముక్తస్థితికి వచ్చేదాకా బాధ్యత నేనే వహిస్తాను'' అన్నాడు.

ఈ నామానికి అర్థము శరణాగతి లేదా సమర్పణము. ముందుగా తనకు బరువైనవన్నీ సమర్పణచేసి, చివరకు తనను తానే సమర్పణ చేసుకుంటాడు. దిక్కుతోచని పరిస్థితిలో కంగారు పడక, బెంబేలు పడక, కనులు మూసుకొని భగవంతుని స్మరణ చేస్తే, ముహూర్తకాలంలో దారి దొరుకుతుంది. ఆ మాత్రం సహనం మనకు లేదు. అందుకే వేమన-

'కాగల పనులెల్ల గాకెటు బోవును?
కాని పనులు కానె కావు భువిని,
మహిమ వేరె యుండ మనతోడ నున్నదా
విశ్వదాభిరామ వినురవేమ!' అని అన్నాడు.

భగవంతుడు కొంతమందిలో నూటికి నూరుశాతం వుంటే, మరికొంతమందిలో 80 శాతం భగవంతుడు, 20 శాతం వాడు వుంటే, ఇంకా కొంతమందిలో 20 శాతం భగవంతుడు, 80 శాతం తాను వుంటాడు. అదికాక కొందరిలో ఆయనకు చోటు లేకుండా నూరుశాతం వాడే ఉంటాడు. మనం ఎంత ఆయనలో ఉంటే, అంతగా నెమ్మదించి ఉంటాము. సమస్యల్లో ఆయనే వుండాలి. ఆయన పెరిగి, మనం తగ్గితే పరిష్కారం వస్తుంది. అంతా మనమే అనుకుంటే తనకు మించిన సమస్య అవుతుంది. ఎంతటివాడికైనా ఇది తప్పదు. అంతా వాడిదే అనుకుంటే సుఖం. వాడిది వాడికొరకే వినియోగించడం అనేది భక్తి మార్గంలో వుంటుంది. భక్తుడికి సమస్యలు సమస్యలుగా కనబడవు. ధర్మరాజుకు, నలుడికి, హరిశ్చంద్రుడికి వచ్చిన కష్టాలు మనకొస్తే, మనం బ్రతికి ఉండము. వాటిని చదివితే మన కర్మ నశిస్తుంది. ఈ నామంలో మనకు ఒక చుక్కాని, ఒక తోడు దొరుకుతుంది.

ప్రొద్దుటి నుండి రాత్రివరకు వాడొకడు వున్నాడని గుర్తు పెట్టుకోండి. అందరికీ మాస్టరుగారి మార్గం గురించి చెప్తూ వుంటాము. ఎందుకు? 'ఆయన లేడు' అన్న భావం వల్లనే. అదే ఆయన కనిపించి "ఏదిరా! నా మార్గం గురించి చెప్పు. వింటాను" అంటే ఎలా ఉంటుంది? నిజంగా మాట్లాడితే ఆయన వున్నాడనుకొనే మాట్లాడుకోవాలి. అందుకే "సర్వసాక్షిగా, సర్వకాలముల యందూ, సర్వ ప్రదేశముల యందూ వుండి నేను చూస్తూనే వుంటాను" అన్నాడు. "నేను చూస్తుండగా నీవు చేయగల పనులు

చెయ్యి. ఎవరూ చూడకుండా చేసే పనులు చెయ్యకు. మనం అబద్ధం చెప్పినా, మనలోపలి ఆత్మసాక్షిగా వుంటాడు. నిజానికి శరణాగతుని ప్రతిక్షణం రక్షించుకుంటూ ఉంటాడు. మనకు తెలియకుండా ఆపద తప్పిపోతే మనకేమీ తెలియదు.

మన దగ్గరకు వచ్చినదల్లా ఇంకొకళ్ళ కోసం వస్తూ ఉంటుంది. విద్య అయినా, విత్తమైనా యింకొకరి కోసమే. అంతవరకూ మన దగ్గర వుంచుతారన్నమాట. అందుకే సమస్తమూ వాడిదిగ, వాడుగా భావించాలి. వాడిని మరచి శాస్త్రములు చదివితే, అందులోని హృదయం అందదు. హోమియోపతి అయినా, జ్యోతిషం అయినా దైవము నందుండి తెలియాలి. అపుడు గుర్తు వస్తుంది. ఎప్పుడూ దైవస్మరణ యందుండే వారికి స్ఫురణ, స్ఫూర్తి వుంటాయి. అవసర మైన విషయం సమయానికి గుర్తు వస్తుంది. స్మరణ లేని వారికి అనవసర సమయాల్లో జ్ఞప్తి ఉండి, అవసరానికి మరపు వస్తుంది!

శృంగేరి చంద్రశేఖర భారతిని ఎవరో అడిగారట. “మనం అద్వైతులం కదా! ఈ పూజలు, స్తోత్రాలు ఎందుకు?” అని. దానికి ఆయన “అద్వైతంలో ఉండానికేరా ఇవన్నీ!” అన్నారు. పనులు ఉన్నప్పుడు దైవసమర్పణగ పనిచేసి, పని లేనప్పుడు భగవంతుని గుర్తుంచుకోవడానికే ఇవన్నీ చెయ్యాలి. తంతు చేస్తూ, వాడిలో వుండటం కన్నా, వాడిలో వుండి, తంతు మానేస్తానంటే ఫరవాలేదు. కాలం జరిగిన కొద్దీ అభ్యాసం జరిగి, మరచిపోలేని స్థితికి వస్తారు. అందుకు ఉదాహరణగా ప్రహ్లాద, నారదాదులను చెబుతారు.

**'నేయః' :**

వాడే నాయకుడు అని అర్థం. ఎప్పుడూ మనకు ముందు ఆయన ఉన్నాడని గుర్తు పెట్టుకోవాలి. *"సుభద్రా పూర్వజో విష్ణుః"* అంటే సుభద్రకన్న ముందు పుట్టినవాడు. వాడు ముందుంటే వెనకంతా సుభద్రమే. అంటే చక్కని భద్రత. ఎందుకంటే నాయకుడు వాడు. "ఒక్కరే వెళ్తున్నారా?", అంటే "వాడితో కలసి వెళ్తున్నా" నని చెబుతాను. వాడు మన ముందు, మన వెనుక, మన చుట్టు ప్రక్కల, మన దగ్గర, మనలో ఉంటాడు. ఏ పనికి వెళ్ళినా, ఆ పనిని చక్కగా నిర్వర్తింపచేస్తాడు.

వాడుంటే మనకు కవచం. శివ కవచము, నారాయణ కవచము అంటే అదే. భగవంతుడు కదుల్దాం అనుకుంటే కదలుతాడు. తనకు పూర్తిగా సమర్పణ చేసుకొన్న వాడికి ఉపయోగపడతారు. అది గుర్తున్నంతసేపూ నీ శరీరం వజ్ర కవచంలా పని చేస్తుంది. చుట్టుప్రక్కల ఏం జరుగుతున్నా, నిన్ను అంటదు. తను, తన శరీరము వాడియొక్క వాహనం అనుకున్న వాడికి శరీరమే కవచంలా పని చేస్తుంది. నాయకుడు అంటే మనలను నడిపించే వాడు. వాడితోపాటు వెళ్తే వేరు. వాడిని స్మరించి చేస్తే వేరు. మనం చేశాం అనుకుంటే వేరు. ఆయన రక్షణకు పెట్టింది పేరు. **"రామో విరామో విరజో మార్గో నేయో" అలా రామావతారంలో తాను ముందుండి అందరికీ రక్ష యిచ్చాడు. కనుకనే "శ్రీరామ రక్ష సర్వ జగద్రక్ష!" అంటారు. రామ నామం, రామ మంత్రం, రామావతారం, రామ తత్వం రక్షణకు పెట్టింది పేరు.**

దైవం మనలో వున్నాడు. మన యందున్నాడు అనే భావన ఎంతసేపు వుంటే, అంతసేపు మన శరీరమే కవచంలా పని చేస్తుంది. చెక్కు చెదరకుండా వుంటుంది. ఇది నిజము. అపాయములలో కూడా దేహానికి ఏ మాత్రం హాని జరుగదు. శరీరము మీద గాయ మవటము కాని, గీత పడటం కూడా అపాయములో జరుగదు. స్మరణ వలన కవచ మేర్పడుతుంది. దైవమే నాయకుడై రక్షిస్తాడు. రక్షకులలో రాముడు ప్రధానుడు. "రక్షణ విషయములో నేను రాముడిని" అని కృష్ణుడు గీతలో బోధించాడు.

**'నయః' :**

అంటే ధర్మమును అనుసరింప చేసేవాడు.

**'అనయః' :**

అంటే అధర్మమును అనుసరింప చేసేవాడు. ధర్మాతీత స్థితిని అనుసరింప చేసేవాడు. ధర్మంగా ప్రవర్తించేవాళ్ళు బయటి ఆకర్షణ వలన అధర్మంగా తయారవుతూ వుంటారు. అధర్మంలో దెబ్బలు తిని, మళ్ళీ ధర్మంలోకి వస్తూ వుంటారు. ధర్మం తెలియడం అంటే పూర్తిగా తెలియడం కాదు. బాగా దెబ్బ తిన్న తరువాత తెలియడమే అసలు తెలియడమట! చిన్నపిల్లవాడిని "బస్సు కిటికీలో నుంచి చెయ్యి బయటకు పెట్టకురా!" అంటే, 'అది చేస్తే ఎలా వుంటుందో చూద్దాం' అన్న స్వతంత్ర బుద్ధి లోపల వుంటుంది. అది ఆత్మనియతి కాదు. ఒకరిచేత నియమింపబడినప్పుడు పసి వాళ్ళలాగా ఆ నియమాలు పాటిస్తాము. మనలో అవకాశం లేక ధర్మంలో వుండేవాళ్ళు చాలా మంది. అవకాశం వచ్చినపుడు జారి పోయినవాళ్ళు చాలామంది.

ఇంద్రుడు, విశ్వామిత్రుడు, ఋషులు, రాజర్షులు- ఇలాంటి వారెందరో! జారిన తరువాత వచ్చే చిక్కులలో నుంచి బయటపడ్డాక మళ్ళీ అలా చేస్తారా? చెయ్యరు. అప్పుడు పడ్డ బాధ మళ్ళీ అలాంటి పని చెయ్యనివ్వని ఆత్మనియతిలో వుంచుతుంది. అధర్మంలోకి వెళ్ళి ధర్మం తెలుసుకున్నవాడిని అది నిజమైన ధర్మాత్ముణ్ణి చేస్తుంది. వాడు సహజమైన ధర్మాత్ముడిగా వుంటాడు.

వశిష్ఠుడిలా అవ్వాలని తపస్సు మొదలుపెట్టిన విశ్వామిత్రుడు మేనక కనబడగానే జారిపోయాడు. దొరికితే అన్ని సుఖాలు, సంపదలు కావాలి. దొరకనపుడు వైరాగ్యం. మనది అభావ వైరాగ్యమా? స్వభావ వైరాగ్యమా? అందుకే విరాగిని పరీక్షించడానికి ప్రకృతి అన్నీ అందిస్తూ ఉంటుంది. ఋష్యశృంగుడు అడవిలో పెరగడం వలన ఆడదాన్నే చూడలేదు. అలాంటి ఆయన వస్తేనే రాజ్యంలో వర్షాలు పడతాయి. ఆయన్ను తీసుకురావడానికి వేశ్యలను పంపితే వారి ఆకర్షణకు లోనై రాజ్యానికి వచ్చాడు. రాజ్యంలో వర్షాలు పడి సుభిక్షంగా వుంది. అప్పుడు ఆయన సంగతేంటి? రాజుగారు కూతురిని యిచ్చి వివాహం చేశారు. అది అనుభవ జ్ఞానం. అనుభవమైన ధర్మం తెలిసేవరకు ఒక ధర్మం వుంటుంది. చెప్తే తెలుసుకొని ధర్మంలోకి వెళ్ళిపోయేవాళ్ళు కొంతమందే వుంటారు. అనుభవించి తెలుసుకున్నవాళ్ళు ఎక్కువమంది వుంటారు. ఈ రెండు మార్గాలలోనూ ఆయనే నడిపిస్తాడు. ఏది ధర్మం, ఏది అధర్మం? అనేది మనం అంత సులభంగా తెలుసు కోలేము. ధర్మంలో ముందుకెళ్ళేకొద్దీ సూక్ష్మం అయిపోతుంది. అది అసలు అర్థం కాదు. అవతారమూర్తిగా భగవంతుడు దిగి వచ్చి చేసే కొన్ని

పనులు చూస్తే 'ఇదేంటి? ఇలా చేస్తున్నాడు?' అనిపిస్తుంది. స్థూలంగా అవగాహన వున్నవారికి సూక్ష్మధర్మం తెలియదు. తెలిసినవాడికి చెట్టు చాటునుండి కొట్టడం ధర్మమే నని తెలుస్తుంది. అలాంటి సూక్ష్మ ధర్మంతోనే భీష్ముడిని, ద్రోణుడిని, కర్ణుడిని, దుర్యోధనుడిని కొట్టించాడు. సూక్ష్మమైన, పరిపూర్ణమైన ఎరుక ఉన్నవాడికే ధర్మం తెలుస్తుంది. తండ్రి మాటకోసం భీష్ముడు, రాముడు రాజ్యం వదిలేశారు. కాని అక్కడ సూక్ష్మధర్మంలో తేడా వుంది. దైవీ స్వభావం వున్నవాళ్ళు ఏం చేసినా ధర్మమేనని తెలుస్తుంది. ధర్మం తెలియాలంటే పూర్వాపరాలు తెలియాలి.

భారతజాతి కష్టాలు పడుతూ ఉందంటే పడాలి మరి! పూర్వా పరాలు తెలిసినవాడికి అంతా ధర్మంగానే కనిపిస్తుంది. మనకొచ్చిన కష్టాలన్నీ చాలా అన్యాయంగా వస్తున్నాయని, సామాన్యంగా అనిపిస్తుంది. సృష్టిలో సుఖం కాని, దుఃఖం కాని, మనది కానిదేదీ మన దగ్గరకు రాదు. అగ్ని ప్రమాదం, భూకంపం- యివన్నీ భగవంతుని దృష్టిలో ధర్మమే. మన ఊళ్ళో ఉపద్రవాలు, మన ఇంట్లో ఉపద్రవాలు, మన ఒంట్లో ఉపద్రవాలు మనలను బట్టే వస్తాయి. దానికి ఎవరూ కారణం కాదు. ధర్మం తెలిసినా పరిపూర్ణ యోగులు చెప్పరు. చెప్పినా మనకు అర్థం కాదు. భగవంతుడి ప్రవర్తన నుండే ధర్మం పుడుతుంది. ఇన్ని పొరలలో ధర్మాన్ని నిర్వర్తిస్తూంటాడని చెప్పడానికి, ఆయనే ధర్మస్వరూపుడిగా, అధర్మ స్వరూపుడిగా కూడా కనిపిస్తాడు. భగవంతుడి విషయంలో, భక్తుల విషయంలో విచికిత్స చేయకూడదు. మంచి, చెడు అని మనం విభజన చేస్తాం కాని, భగవంతుడు అలా కాదు. అధర్మం ఆచరించే వాడిని కూడా ఆయన చల్లగా చూస్తాడు.

ఆయనలో యిమిడి వుండటమే పరమ ధర్మం. నీవే ధర్మం, నీవే అధర్మం. అధర్మ ప్రవర్తన ఎక్కడి నుండి వస్తుందంటే ధర్మాన్ని నిర్వర్తింప చేయడానికే వస్తుంది.

**వీరః శక్తిమతాం శ్రేష్ఠో ధర్మో ధర్మ విదుత్తమః।**

**'వీరః' :**

అహంకారమును జయించినవాడే నిజమైన వీరుడు. అట్టివాడే స్థిరత్వం కలిగి వుంటాడు. రాముడు అహంకారమును జయించాడు. అతను నిరహంకారి. అందువలననే అహంకారియైన రావణుని జయించగలిగాడు. అహంకారి, నిరహంకారి చేతిలో ఓడిపోక తప్పదు. నిరహంకారి త్రిగుణాల్ని జయించినవాడు అవటంచేత ఆత్మ స్వరూపుడై వుంటాడు. అంతటా వ్యాపిస్తాడు. అందరి హృదయాలను ఆక్రమిస్తాడు. పరాక్రముడుగా బిరుదు పొందాడు. నిరహంకారము అహంకారాన్ని జయిస్తుంది. మహత్తరమైన అహం కారముతో కూడిన బ్రిటిష్ సామ్రాజ్యాన్ని అహంకారులైన వీరు లెవ్వరూ గెలవలేకపోయారు. నిరహంకారియైన మహాత్మా గాంధీ ఒంటరిగా జయించాడు. ఆయనే నిజమైన వీరుడు.

నిరహంకారులు శక్తిమంతులలో శ్రేష్ఠులు. వారు ధర్మా ధర్మములను తెలిసినవారిలో ఉత్తములు. శ్రీరాముడు ఒంటరి వీరుడు. అతడి వీరత్వము రామాయణములో చాలచోట్ల గోచరిస్తుంది. స్థిరసంకల్పము అతడి సహజమైన ఆస్తి.

వీరు డంటే సాహసకృత్యాలు చేసేవాడని మన భావన. కానీ సాహసకృత్యాలు స్థిరత్వం కలవారే చేయగలరు. సందేహం,

సంశయం, అనుమానం, భయం, ఆదుర్దా, ఆందోళన వుండ కూడదు. అందుకే జ్వాల్‌కూల్ మహర్షి సాధకుల లక్షణం, "To dare" అని చెప్పారు. "To will, To dare, To know and To be Silent" అని చెప్పారు. భాగవత మార్గంలో భగవద్దర్శనం కోసం చేసే ప్రయత్నము లలో ఉత్తమమైనది సాహసం. సాహస మున్న వారినే విజయలక్ష్మి వరిస్తుంది. పిరికివారికి ఏమీ లభించదు. ఈ దేహంలో వుండగానే సమస్త సృష్టిని, దానికి ఆధారమైన భగవత్ తత్వాన్ని అవగాహన చేసుకోవడానికి అవకాశ మున్నది. అది పొందా లంటే, మనలో సాహసం వుండాలి.

"ఈ నాలుగు లక్షణా లుంటేనే రంగంలోకి రండి! లేకపోతే వద్దు" అన్నారు జ్వాల్‌కూల్ మహర్షి. 'To will' - ముందు సంకల్పించు. అన్ని లోకములు మానవ శరీరంలో వున్నాయి. ఆ అనుభూతిని పొందగలిగిన స్తోమతను కూడా అమర్చాడు. మానవ శరీరం పరిపూర్ణ సృష్టికి ప్రతీక. అందులో 14 లోకాలూ ఉన్నాయి. మన సంకల్పం బట్టి మనం నరకంలోనూ, అథవా స్వర్గంలోనూ జీవించవచ్చు. దానికి స్థిర సంకల్పం కావాలి. 'వీరః' అంటే స్థిరచిత్తము గలవాడని అర్థము. సంకల్పం చేశాక, పాతకర్మ అడ్డురావటానికి ప్రయత్నం చేస్తూ ఉ ంటుంది. కాని వాటిలో మనం జారిపోకూడదు. ఏది ఏమైనా సరే, తీసుకున్న నిర్ణయాన్ని నిర్వర్తించాలి. పరిస్థితుల ప్రభావానికి లొంగ కూడదు. అలా లొంగినవాడు ఇహలోకంలో మరియు పరలోకంలో కూడా దేనినీ సాధించలేడు. ఎదురుగా తాతయ్య, గురువుగారు, అన్న దమ్ములు కనబడేసరికి అర్జునుడు జారిపోతే, శ్రీకృష్ణుడు *"క్షుద్రం హృదయ దౌర్బల్యం"* అంటాడు. సంకల్పం చేస్తే "To will'

అన్నారు కదా! "You have to stand by it." అలా నిలబడగలిగినవాడే ముందుకు పోగలడు. మంచి సంకల్పం కలిగినప్పుడే యోగ సాధన మొదలు పెట్టాలి. 'ఎటువంటి పరిస్థితులలోనూ ఈ సాధన మానను, అభ్యాసం మానను' అని నిలబడాలి. అందుకే పతంజలి మహర్షి *"అథ యోగానుశాసనమ్"* అన్నాడు.

'అథ' అంటే ఇప్పుడు, అంటే, 'సంకల్పము నందు స్థిరముగా నిలబడే దృక్పథము ఏర్పరచు కున్నప్పుడు' అని అర్థం. మహాత్ముల జీవితాలు తరచి చూసుకుంటే నలుగురూ నడచిన దారిలో పోయి నట్లుండదు. మనకు అతడు తప్పుదారిలో నడుస్తున్నట్లుగా అనిపిస్తున్నా కాలక్రమంలో నిజం తెలుస్తుంది. మహాకవి పోతన అలాంటివాడే. అందరూ కావ్యాలను రాజుకు అంకితమిస్తే ఆయన యివ్వనని సంకల్పించాడు. *"సత్కవుల్ హాలికులైన నేమి నిజదార సుతోదర పోషణార్థమై"* అన్నాడు. కన్నీళ్ళు పెట్టుకున్న సరస్వతీ దేవిని ఓదార్చాడు. తను తీసుకున్న నిర్ణయం మీద ఖచ్చితంగా నిలబడ్డాడు. రాముడు కూడా తండ్రి మాట నిలబెట్టడానికి అలా చేశాడు. మంత్రులు, వశిష్ఠుడు, భరతుడు రకరకాలుగా సలహాలు చెప్పారు. కాని రాముడు తన నిర్ణయం మార్చుకోలేదు. విశ్వామిత్రుడితో పంపేటప్పుడు దశరథుడు రాముడికి 'గురువు మాట విను' అని చెబుతాడు. ధర్మసంస్థాపనార్థం దిగివచ్చిన భగవత్తత్వం మొదటి సారిగా స్త్రీ మీదే బాణం వేయవలసి వచ్చింది. తండ్రిమాట, గురువు మాట విని బాణం వదిలాడు. అది ధర్మం. అంతేకాని, ఆడవాళ్ళను కొట్టడం తప్పు కదా! అనలేదు. రాముని స్థిరచిత్తం గుర్తు చేసుకుంటే

ఆశ్చర్యం వేస్తుంది. ఏడు రోజులు పగలు, రాత్రి నిద్రపోకుండా యజ్ఞానికి కాపలా కాయమంటే అదే చేశాడు. గురువు మాటకు మరుమాట వుండదు. ఆ తరువాత "మిథిలకు పోదాం రా!" అన్నాడు. వెళ్ళాడు. "శివధనుస్సు చూడు" అంటే చూశాడు. "ఏమనిపిస్తూ ఉంది?" అని అడిగితే, "చూస్తుంటే ఎక్కుపెట్టా లనిపిస్తూ వుంది" అన్నాడు. "అయితే ఎక్కుపెట్టు" అంటే, ఎక్కుపెట్టాడు. అంతేకాని పెళ్ళి చేసుకోవాలని ఎక్కు పెట్టలేదు.

ధర్మరాజు కూడా అలాంటివాడే. "ద్రోణుని గెలవడం కష్టం; చిన్న అబద్ధం చెప్పితే తప్పు లేదు" అన్నాడు కృష్ణుడు. *"అశ్వత్థామ హతః, కుంజరః।"* అని చెబుతానంటాడు. అలా ధర్మము నందు పూర్ణ విశ్వాసం వున్నవాడు కాబట్టి యక్షప్రశ్నలకు, నహుష ప్రశ్నలకు సమాధానలు చెప్పి తమ్ముళ్ళను రక్షించుకున్నాడు. స్వర్గారోహణ పర్వంలో మహాప్రస్థానంలో దారిలో ఒక్కొక్కరు పడిపోగా చివరిదాక వచ్చిన 'కుక్క'ను కూడా రథం ఎక్కించా లన్నాడు. తనతోబాటు వున్న జీవిని రక్షించటం ధర్మం. ఆ కుక్క రూపంలో వున్న యమ ధర్మరాజు ప్రత్యక్షమై "చాల సంతోషం!" అన్నాడు. యుద్ధభూమిలో కూడా "మా ఐదుగురిలో ఎవరితోనైనా నీవు యుద్ధం చేయ వచ్చు. ఆయుధాన్ని, ప్రత్యర్థిని ఎన్నుకో!" అంటే, దుర్యోధనుడితో ధర్మరాజు అంటే శ్రీకృష్ణుడే భయపడ్డాడు. భీముడిని ఎన్నుకోవటం దుర్యోధనుడి రాజసానికి చిహ్నం. యక్షుడి దగ్గర, నహుషుడి దగ్గర, భీష్మ, ద్రోణ, కర్ణుల దగ్గర మనలను రక్షించేది ఏది? ధర్మమే. ఎట్టి పరిస్థితులలోనైనా సరే, సర్వము నాశనమైనా సరే, ధర్మాన్ని మాత్రమే అనుసరిస్తాడు కనుకనే ధర్మరాజు అని పేరు వచ్చింది.

ఊరకే బెంబేలు పడటం, ఆదుర్దా పడటం, ఆందోళన, కంగారు, క్రుంగడం, పొంగడం- యివన్నీ యోగసాధన చేసేవారికి అడ్డుగా వస్తాయి. అవేవీ అక్కరలేదు. అలాంటి స్థిరచిత్తుడు రాముడు. రామునికన్నా సీతను ప్రేమించే వారెవరూ ఉండరు. వాళ్ళిద్దరూ రెండు శరీరాలు, ఒకే ఆత్మ అనేలా ఉండేవాళ్ళు. అందుకే అది ఆదర్శ దాంపత్యం. తన స్త్రీ తనతోనే వుంటుంది కాబట్టి యితర స్త్రీల యందు, తన పురుషుడు తనతోనే వుంటాడు కాబట్టి యితర పురుషుల యందు, వ్యామోహం వుండకపోవటమే దాంపత్య ధర్మం. అది అవినాభావ సంబంధం. అలాంటివాడు ఆమెను అగ్నిప్రవేశం చేయమనటానికి ఎంత స్థిరచిత్తం వుండాలి! ఎందుకని? అని లక్ష్మణుడు అంటే, “ఆమెను ఎవరన్నా సంవత్సరం పాటు లంకలో వుంది'' అని ఒక్కమాట అంటే నేను బ్రతుకలేను. ఆమె శీలం గురించి నాకు తెలుసు. ప్రపంచానికి ఎట్లా తెలుస్తుంది? ఆమె యందు ఏ కళంకమూ లేదని చెప్పవలసిన బాధ్యత కూడా వుంది కాబట్టి ఆమెను అటువంటి కష్టానికి నేను గురిచేశా'' నని చెప్తాడు. రాముని తరువాత అంతే స్థిరచిత్తం సీతలో కనిపిస్తుంది.

మనం కూడా సాధనలో భాగంగా ''If we make a decision, we have to stand by it. If we don't make it, it's O.K. And you have all the time in the world to think, before you make a decision. But, once you make it, you have to stand by it''. పేదరికం, అపకీర్తి, అపహాస్యం, అనారోగ్యం ఏదొచ్చినా, చేసుకున్న నిర్ణయం మీద నిలబడి వుండటమనేది భగవత్తత్వం. దాని ప్రభావం, అగ్ని వంటిది. వేడిమికి ఏదొచ్చినా కాల్చేసి దారి చూపిస్తుంది.

రామాయణంలో సుగ్రీవుడు కూడా రకరకాల పరీక్షలు పెడతాడు. తాటి చెట్లను ఒకే బాణంతో కొట్టడం ద్వారా, దుందుభిని కాలి బ్రొటనవ్రేలితో తన్నడం ద్వారా మిత్రుడికి విశ్వాసం కలిగించాడు. కోతి అని తెలిసి, మిత్రత్వానికి నిర్ణయం చేసు కున్నాడు. తరువాత మిత్రుడిగా వాడికి తను విశ్వాసం కలిగించాలి కాబట్టి వాడేం చెప్తే అది చేశాడు. అదీ స్థిరత్వం.

**'శక్తిమతాం శ్రేష్ఠః' :**

శక్తిమంతులలో శ్రేష్ఠుడు రాముడు. రావణాసురుడికీ శక్తి ఉంది. రాముడికీ శక్తి ఉంది. శక్తిమంతం, దివ్యత్వం కావటానికి వీల్లేదు. ధర్మాన్ని అనుసరించేవాడు శ్రేష్ఠమైన శక్తిమంతుడు. మంచి కండలు కలిగి అందరినీ తంతుంటే రౌడీ అంటారు. అదే నలుగురిని రక్షిస్తే మహాత్ము డంటారు. భగవంతుడుగా, రాముడిగా, నరుడిగా, పరుడిగా రెండు రకాలుగా చెబుతున్నా. శక్తిమంతుడు శ్రేయోదాయకమైన కార్యాలలో నిమగ్నుడైతే అక్కడ భగవంతుని తత్వాన్ని, తన కార్యాలలో నిమగ్నులైతే అక్కడ రావణుని చూడాలి. రావణుడు తన కోసం పని చేసుకున్నాడు. రాముడు ఋషుల కోసం పని చేశాడు. రావణుని నాయకత్వంలో రాక్షసులు ఋషులను పెడుతున్న బాధలను చూసిన రాముడు రాక్షసు లందరినీ సంహరిస్తా నన్నాడు. "వాళ్ళతో మనకు వైరం లేదు కదా! ఎందుకు ఇటువంటి ప్రతిజ్ఞ చేశారు?" అని అమ్మవారు అడిగితే, 'ధర్మస్థాపనకు. ఎక్కడ ధర్మం లేదో, అక్కడ ధర్మాన్ని స్థాపనం చేయడం నా యొక్క జీవన లక్ష్యం. ధర్మాన్ని నెలకొల్పడం క్షత్రియుడిగా నా ధర్మం. అధర్మాన్ని ఆచరించే వాళ్ళందరూ నాకు శత్రువులు. వాళ్ళు ఏ రోజు అధర్మంలో

నుంచి ధర్మంలోకి వస్తారో, ఆ రోజునుంచి నాకు మిత్రులే'' అన్నాడు. అందుకే విభీషణుడు మిత్రు డయ్యాడు. రావణుడికి కూడా మిత్రు లవుదామని చాలాసార్లు చెబుతాడు. రావణుడు ఒప్పుకోలేదు. కాబట్టి సంహరించేస్తాడు. అయినా దహన సంస్కారాలన్నీ శాస్త్రోక్తంగా తనే చేయిస్తాడు. అక్కడున్నదీ ధర్మమే.

## 'ధర్మో ధర్మ విదుత్తమః' :

*"రామో విగ్రహవాన్ ధర్మః"* అంటే ఆయన విగ్రహమే ధర్మం. అంత పరిపూర్ణమైన అవతారం కనిపించదు. తనకున్న శక్తి అలాగే వాడాడు. జనస్థానంలో **14** వేల మంది రాక్షసులను సంహరించిన ఏకైక వీరుడు. *"శక్తిమతాం శ్రేష్ఠః"* అనే తత్వం పరిపూర్ణంగా వున్నవాడు. ముట్టుకోగానే శివుని విల్లు విరిగిపోయింది కదా! చూడటానికి ఎంతో సుకుమారంగా వున్నా, ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులు మూడూ వ్యక్త మవుతుంటాయి. మొత్తం భూగోళాన్ని **21** సార్లు తిరిగి క్షత్రియు లందరినీ కొట్టిన పరశురాముడు వచ్చి, "ఈ విష్ణు ధనుస్సు ఎక్కుపెట్టు, చూద్దాం!" అన్నాడు. దాన్ని ముట్టుకోగానే పెద్ద అయస్కాంతం చిన్న అయస్కాంతంలోని శక్తిని లాగేసినట్లుగా పరశురాముడి బలమంతా రామునిలోనికి ఆకర్షింపబడింది. ఇవి అతిశయోక్తులు కావు. వాల్మీకి మహర్షికున్న తేజస్సు, ఆయన సాధన అలాంటిది.

రాముడు చూపించిన ధర్మాన్ని మించిన ధర్మం లేదు. విశ్వామిత్రుడి దగ్గర ప్రవర్తించిన తీరులో, ధనుస్సు ఎక్కుపెట్టిన సందర్భంలో, తండ్రి క్లిష్ట పరిస్థితిలో, గుహుడి దగ్గర, భరతుడితో చేసిన సంవాదంలో, ఋషులతో మాట్లాడినప్పుడు, సుగ్రీవ స్నేహంలో,

వాలి సంహరణంలో, విభీషణుడి కిచ్చిన ఆశ్రయంలో, ప్రతిచోట ధర్మమే. రావణ సంహారం తరువాత దహన సంస్కారంలోనూ ధర్మమే. భరతుడు ఆత్మాహుతి చేసుకోకుండా, సమయ పాలనం చేయడం సోదర ధర్మం. భరతుని మీద అంత ప్రేమ ఎందుకంటే, అతడు తన ప్రతిరూపమేనని రాముడికి తెలుసు. అందుకే భరతుడు రామపాదుకలే పెట్టి రాజ్యం చేశాడు.

కానీ భరతుడు తన చుట్టూ సమస్త సంపదలున్నా, తాను అనుభవించకుండా నారబట్టలు కట్టుకొని, ఆయనలాగే ఊర్ధ్వ ముఖంగా శిఖ ముడివేసుకుని, కందమూలాలు తింటూ, అయోధ్యలో కాక నందిగ్రామంలో వుంటాడు. వ్యక్తిగత సౌఖ్యాలేవీ అనుభవించడు. అందుకే రాముడు భరద్వాజ ఆశ్రమంలో దిగిపోయి తమ్ముణ్ణి చూసి రమ్మని హనుమంతుని పంపిస్తాడు. భరతుని జీవన విధానాన్ని గమనించిన హనుమంతుడికి రామునిపై కోపం కూడా వస్తుంది. భరతునితో తాను వచ్చిన కారణం గురించి “ముందుగా నీకు కబురు చేద్దామని వచ్చాను'' అని చెబుతాడు. అరణ్యావాసంలో రాముని వద్దకు మంత్రులతోను, సైన్యంతోను, తల్లులతోను కలసి భరతుడు వస్తుంటే చెట్టుపై నుండి చూసిన లక్ష్మణుడి ఆలోచనలకు విభిన్నంగా ఉంది భరతుడి వ్యవహారం. అదీ భరతుడు. భరతుడి గురించి అందరికీ తెలియాలనే హనుమను పంపడం. రాముడు రకరకాలుగా ధర్మం చూపిస్తాడు. ఎంత ధర్మం అంటే, అసలు విభీషణుని అంగీకరించడమే పెద్ద ధర్మం. వాలిని సంహరించడం పెద్ద ధర్మం. అమ్మవారిని అగ్నిప్రవేశం చేయమనడం మహా ధర్మం. అందుకే మనం ధర్మంలో వుండాలనుకుంటే రాముని చరిత్ర ఆదర్శం. ఈ భూమి వున్నంత కాలం రామచరిత్ర వుంటుంది.

రామాయణం complete human. అయితే కృష్ణావతారం super human. అందుకే మన స్వభావాన్ని బట్టి ఆయా పాత్రలు నచ్చుతాయి. సత్వగుణంలో వుండేవాళ్ళను, రజోగుణంలో వుండే వాళ్ళు తక్కువగా చూస్తారు. అందుకే ధర్మరాజు అందరి దృష్టికీ ఆనడు. సుగ్రీవుడు, విభీషణుడు కూడా ఆనరు. అందుకే సత్వములో నిలబడగలవారే ధర్మంలో నిలబడగలరు. లేక ధర్మములో నిలబడిన వాళ్ళలో సత్వం ఉంటుంది. మహాత్ము లందరూ సత్వము నందు వుంటూ కార్యక్రమాలు నిర్వరిస్తూ వుంటారు. ఎందుకంటే సత్వము నుండి సత్వాతీతమైన శుద్ధ చైతన్యము లోనికి దారి వున్నది. రజస్సు, తమస్సుల నుంచి లేదు. సత్వగుణం కలవారు ఎప్పుడూ భగవంతునితో అనుసంధానం చెంది వుంటారు. వారు ధర్మంలో ఉండటం చేత, ధర్మమే దైవమవటం చేత వారి కెప్పుడూ రక్షణ ఉంటుంది. అధర్మంగా ప్రవర్తిస్తూ మంత్రాలు చేస్తే మంత్రం రక్షించదు. ధర్మంగా ప్రవర్తిస్తూ, మంత్రం చేయకపోయినా ధర్మం రక్షిస్తుంది. పంచభూతాలు తమ ధర్మాన్ని నిర్వర్తిస్తాయి. మామిడి పండు, టమోటా పండులా ఉండదు. అవి వాటి ధర్మం. అలాగే, మానవుడికి కూడా కొన్ని ధర్మా లున్నాయి. అవి మను ధర్మస్మృతిలో చెప్పారు. మహాత్ములు ఏ విధంగా జీవించాలో చూపిస్తారు. అది సాధ్యమా అంటే, సాధ్యమే అంటారు. ధర్మంలో నిలబడ్డవాడు ప్రత్యేకించి, ఆరాధనలు చేయనక్కరలేదు. ధర్మంలోకి రావాలి.

*"ధర్మ విత్ ఉత్తమః"* అంటే ధర్మం తెలిసినవాళ్ళలో కూడా రాముడు ఉత్తముడట. జాంబవంతునికి కూడా చాలా ధర్మం తెలుసు. జాంబవంతుడు సప్తర్షి మండలం యొక్క ప్రతీక. భల్లూకం

అంటే POLAR BEAR. అంటే సప్త ఋషుల కలయిక. అక్కడున్నది బ్రహ్మజ్ఞానపు పుట్ట. జాంబవంతునికి సృష్టిలో తెలియ నిది లేదు. అలాంటి వ్యక్తికి కూడా విభీషణుని అంగీకరించే సమయంలో రాముడు ధర్మం చెప్తాడు. వశిష్ఠ మహర్షికి కూడా ధర్మం చెప్పాడు. వాలికి ధర్మం తెలుసు. కాని తారకు వాలికంటే ధర్మం ఎక్కువగా తెలుసు. ఆమెకు కూడా ధర్మం చెప్పాడు రాముడు. కృష్ణుడు చెప్పిన ధర్మం ఎవరికీ తెలియదు. అందుకనే అది ధర్మ యుద్ధం. ఆ ప్రదేశం ధర్మక్షేత్రం. ఆ యుద్ధంలో దుర్యోధనుడు తొడలు పగిలి పడిపోతే అప్పుడు బలరాముడు వస్తాడు. భీష్మ, ద్రోణ, కర్ణాదులను గురించి వినేసరికి కోపం వచ్చి చంపేస్తా నంటే, "నీకేం తెలుసు ధర్మం!" అని కృష్ణుడే ఆపుతాడు. ఇప్పుడు కాదు, మొదటినుంచి ధర్మం గురించి లెక్క వెయ్యాలి. ఏది ధర్మం? విషం పెట్టడం, లక్క ఇంట్లో పెట్టి అంటించడం, సభలో చీరలూడదీయడం ధర్మమా? అభిమన్యుని చంపడం ధర్మమా?" అని అడిగాడు. "ఐదుగురితో ద్రౌపదికి పెళ్ళి చేయడం ఏ ధర్మ" మని ద్రుపదుడు ధర్మరాజును అడిగితే ధర్మమే నన్నాడు. ప్రజలకు, ఎలా, ఏమని సమాధానం చెప్పాలి? ఏది ధర్మం? అన్న మీమాంసలో ఉండగా వేదవ్యాసుడు ప్రత్యక్షమై ద్రుపదుడి భ్రూమధ్యంలో స్పృశించి, ద్రౌపది పూర్వజన్మ వృత్తాంతం చెబుతాడు. చివరకు ద్రౌపదినే పిలిచి "ఈ పెళ్ళి నీకు సమ్మతమా?" అంటే, "ఔను" అంటుంది. ఒక స్త్రీకి సమ్మతమైతే అది ధర్మమే నన్నాడు. జరుగుతున్న దంతా ధర్మమే అని చెప్తుంది ధర్మము. ప్రపంచంలో కొంతమంది కష్టపడుతున్నారు. కొందరు సుఖపడు తున్నారు. ఇది కలియుగ ధర్మం. ప్రకృతి ప్రళయాలను గురించి వ్రాస్తూ 'ప్రకృతి రక్కసి' అనడం ధర్మం కాదు.

ద్రౌపదీ స్వయంవరానికి వెళ్తూ, సమయం వ్యర్థమవుతుం దేమోనని సాయంసంధ్యను చెయ్యని అర్జునుడికి దారిలో యక్షుడు అడ్డుపడి, చితక్కొట్టి "మీ ధర్మాన్ని నిర్వర్తించకపోతే మీకు బలం రాదు. ఆ మత్స్యయంత్రాన్ని కొట్టాలంటే నీలో ధర్మం ఉండాలి. దేవతలు మీయందు ప్రీతి కలిగి వున్నారు. మీ చిన్నిపొరబాటుకు హెచ్చరిక చేయడానికి వచ్చాను'' అంటాడు.

కాబట్టి మనం సరియైన మార్గంలో సాధన చేద్దాం. Let us try to be more inclined to the Law than to look for varieties of worships, prayers, rituals, meditations etc. మన పెద్దలు ఉగ్రమైన తపస్సులు, సాధనలు చెప్పలేదు. ధర్మాచరణ మాత్రమే చెప్పారు. తద్వారా దైవానుభూతి. అది సరాసరి మార్గం. ధర్మాన్ని అనుసరిస్తున్న కొద్దీ మనలో దైవం పెరుగుతుంది. అంటే సత్యం పెరుగుతుంది. సత్యం పెరిగిన కొద్దీ దైవానికి దగ్గరవుతాము. *"సత్యమేవ జయతే ।''* అనునది భారతీయుని ధర్మం. రాముని జీవితంలో ఇవి కనిపిస్తాయి.

**ఈ శ్లోకం అంతా రాముడికే అంకితం.**

**- స్వస్తి -**

# ధనిష్ఠ ఇతర ప్రచురణలు

| | | |
|---|---|---|
| 1. | వినాయక వ్రతకల్పము | 25–00 |
| 2. | పురాణపురుషుని పూజావిధానము | 10–00 |
| 3. | శరన్నవరాత్ర పూజా విధానము | 30–00 |
| 4. | శ్రీ దత్తాత్రేయ పూజా విధానము | 10–00 |
| 5. | హనుమాన్ చాలీసా | 15–00 |
| 6. | శ్రీ మహాలక్ష్మి పూజా విధానము | 12–00 |
| 7. | శ్రీరామ పూజా విధానము | 15–00 |
| 8. | శ్రీ శివ హృదయము | 05–00 |
| 9. | శ్రీ శివ పూజా విధానము | 15–00 |
| 10. | శ్రీ సూర్య పూజా విధానము | 07–00 |
| 11. | శ్రీ వేంకటేశ్వర పూజా విధానము | 08–00 |
| 12. | శ్రీ విష్ణుసహస్రనామ స్తోత్రము | 12–00 |
| 13. | శ్రీ లలితా సహస్రనామ స్తోత్రము | 10–00 |
| 14. | శ్రీ సుబ్రహ్మణ్య పూజా విధానము | 10–00 |
| 15. | శ్రీ సౌకుమార్య శతకము | 10–00 |
| 16. | శ్రీ రామ చరిత్రము | |
| 17. | గజేంద్ర మోక్షణము | |




యత్ర యత్ర రఘునాథ కీర్తనం,
తత్ర తత్ర కృతమస్తకాంజలిం ।
బాష్పవారి పరిపూర్ణలోచనం,
మారుతిం నమత రాక్షసాంతకమ్ ॥